తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 146
మంగళవారం | 28, అక్టోబర్ 2025
॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## రష్యా చమురు విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి

**ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోవిధానం**

**కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్**



**కౌలాలంపూర్,అక్టోబర్27(అక్షర గళం):** రష్యా చమురు విషయంలో అమెరికా అను సరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తప్పుబట్టారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కో దేశం పట్ల ఒక్కో విధంగా వ్యవహరిస్తుండడాన్ని తప్పుబట్టారు.

మిగతా.. 2లో

## డిజిటల్ అరెస్ట్‌లపై అవగాహన కలిగించాలి

- అత్యంత భయంకరమైన ప్రమాదంగా గుర్తించాలి
- ఐపిఎస్ ప్రొబెషనర్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ,అక్టోబర్27 (అక్షర గళం):** ప్రజలను చైతన్యం చేయడంతోనే డిజిటల్ అరెస్ట్ ముప్పును ఛేదించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఇందుకు పోలీస్ శాఖ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు.

మిగతా.. 2లో

## తక్కువ వ్యయంతో ప్రాణహిత చేవెళ్ల పునరుద్ధరణ

- ప్రభుత్వం పరిశీలనలో ఉందన్న మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని తక్కువ వ్యయంతో పునరుద్ధరించేలా తమ ప్రభుత్వం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్

మిగతా.. 2లో





## మైనార్టీలను మోసం చేసిన కాంగ్రెస్

- బిజెపి స్కూళ్లో శిక్షణ పొందిన రేవంత్
- బిఆర్ఎస్ హయాంలోనే వారికి మేలు జరిగింది
- మేమూ కొన్ని పొరపాట్లు చేసినా.. మేలు చేశాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** రాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మైనార్టీల కోసం రూ.4 వేల కోట్ల బ్జడెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మైనారిటీ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు..

మిగతా.. 2లో

### బిఆర్ఎస్ హయాంలో గురుకులాల పురోగతి

- కాంగ్రెస్ హయాంలో దిగజారిన పరిస్థితులు
- ఇప్పటివరకు వందమంది విద్యార్థుల మృతి
- అయినా స్పందించని సర్కార్: కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** బీఆర్ఎస్ పాలనలో గురుకులాలు ఎంతో వృద్ధి సాధించాయని బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా.. 2లో

## బిఆర్ఎస్.. చర్చిలలో ప్రచారం..!

- నిబంధనల ఉల్లంఘనలతో మోసం
- ఆధారాలతో ఈసీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఎన్నికల ఆర్వోకు సోమవారం రాలను ఆర్వోకి అందజేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థి పేరు, ఫోటోతో కూడిన ఓటర్ స్లిప్స్ పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై రిటర్నింగ్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేశామని మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. చర్చిలలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.



కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శ్రీగణెష్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కంప్లైంట్ చేశారు. కోడ్ ఉల్లంఘనలో భాగంగా చర్చిలకు వెళ్లి ప్రచారం చేస్తున్నట్లు ఆధా బీఆర్ఎస్ నేతలు ఓటరు పోల్ చిట్టిలను పంచుతూ అడ్డంగా దొరికారని మండిపడ్డారు. ఆధారాలతో సహా రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు

మిగతా.. 2లో



## సుప్రీంకోర్టు తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

- కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సిజెఐ గవాయ్

**న్యూఢిల్లీ,అక్టోబర్27 (అక్షర గళం):** సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్య కాంత్ నియామకం కాను న్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్య కాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియ జేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో

మిగతా.. 2లో

## అధికారిక గృహాల మరమ్మత్తులు

**సీటింగ్ 7 నుంచి 12 లక్షలకు పెంపు**

**తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ అధికారిక గృహాల మరమ్మతుల ఖర్చుల పరిమితులు పెంచుతూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల గృహాల రిపేర్ ఖర్చులకు కొత్త సీలింగ్ లిమిట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రుల అధికారిక నివాసాల మరమ్మతుల కోసం రూ.20 లక్షల వరకు ఖర్చుకు అనుమతినిచ్చింది. ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల గృహాలకు రూ.12 లక్షల వరకు సీలింగ్ పరిమితిని పెంచింది. ఇతర ప్రభుత్వ అధికారుల అధికారిక నివాసాల మరమ్మతులకు రూ.7 లక్షల వరకు ఖర్చు చేసేందుకు పర్మిషన్ ఇచ్చింది. పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన రేట్లను తాజాగా సోమవారం సడలించింది. పెరిగిన కూలీ, మెటీరియల్ ఖర్చుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పెంపు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్/బీ చీఫ్ ఇంజనీర్ సిఫార్సులపై ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త లిమిట్ల అమలు వెంటనే చేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణలో నాలుగు రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక**

**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని



హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మంచిర్యాల, నిర్మల్, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. గురు, శుక్రవారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో తెలంగాణ భవిష్యత్

- మీడియాతో బిజెపి ఎంపి లక్ష్మణ్
- ఇక్కడ గెలుపుతో విజయానికి నాంది అన్న రామ్

**హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెలంగాణ భవిష్యత్‌తో ముడిపడి ఉందని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అజెండా మజ్లిస్‌ను పెంచి పోషించడమేనని అన్నారు. డబ్బు కుమ్మరించడంలో రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ ముసుగులో మజ్లిస్‌ను గెలిపించే ప్రయత్నం జరుగుతుంది. చొరబాటు దారులు, రోహింగ్యలు పెత్తనం చలాయిస్తున్నారు. ఈ ఎన్నికను బీజేపీ కార్యకర్తలు సవాల్‌గా తీసుకోవాలని కోరారు. తెలంగాణలో ఒక్క ఏడాదిలో 5 వందల హత్యలు జరిగాయి. పోలీసులకే రక్షణ లేదు. గన్ కల్చర్ పెరిగిపోయింది. శాంతి భద్రతలు క్షీణించిపోయాయి. ఇక బీఆర్ఎస్‌ది గత చరిత్రనే.. మళ్లీ గెలిచేది లేదు. కాంగ్రెస్ మభ్య పెట్టి అధికారంలోకి వచ్చింది. మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన మీద పట్టు కోల్పోయారు. ఐఏఎస్‌లు బలవంతంగా పదవి విరమణ చేసే పరిస్థితి వచ్చింది. బీసీ నినాదం ఎత్తుకుని రాహుల్ గాంధీ అభాసు పాలయ్యారు. మొసలి కన్నీరు కారుస్తున్నారు. మొదటి నుంచి బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించింది రాహుల్ కుటుంబం. మోడీ ఓటు బ్యాంక్‌ను చీల్చే కుట్ర. బీసీలకు న్యాయం జరుగుతుంది అంటే అది మోడీ

మిగతా.. 2లో

## దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

- త్వరలో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో నిర్వహణ
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్




**న్యూఢిల్లీ,అక్టోబర్27 (అక్షర గళం):** దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల

మిగతా.. 2లో

## మహిళా అధికారులకు మంత్రుల వేధింపులు

- వేధింపు మంత్రులను తొలగించండి
- అర్ధరాత్రిళ్లు వారిని పిలిపించుకోవడం ఏమిటి
- కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ కేంద్రమంత్రి బండి



**కరీంనగర్,అక్టోబర్27 (అక్షర గళం):** మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా.. 2లో

## డిజిటల్ అరెస్ట్‌లపై అవగాహన కలిగించాలి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

## తక్కువ వ్యయంతో ప్రాణహిత చేవెళ్ల పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

దిశానిర్దేశర చేశారు. సుందిల్లా లింక్ ద్వారా కొత్త అలైన్‌మెంట్‌తో 10 నుంచి 12 శాతం వ్యయం తగ్గే అవకాశం ఉందని వివరించారు. భూసేకరణ సగం మేరకు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. సుమారు రూ.1,500 నుంచి 1,600 కోట్లు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. కొత్త అలైన్‌మెంట్ సాంకేతికంగా, బలంగా ఉండేలా రూపకల్పన చేస్తున్నామని పేర్కొ?న్నారు. నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణతో సమతౌల్యంగా ప్రాజెక్టు రూపకల్పనపై దృష్టి పెట్టామని వెల్లడించారు. తక్కువ పొడవు ఉన్న కాలువలు, టన్నెల్‌లతో నిర్మాణ వ్యయం తగ్గనుందని వివరించారు. పంప్ హౌస్‌ల సంఖ్య 15 నుంచి 10కి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్క పంప్ హౌస్ 30మెగావాట్ల సామర్థ్యం ఉంటుందని స్పష్టం చేశారు.విద్యుత్ వినియోగం తగ్గి,నిర్వహణ సులభతరం కానుందని చెప్పుకొచ్చారు. సుందిల్లా లింక్ ద్వారా ప్రాజెక్టు పర్యావరణపరంగా సానుకూల మార్గంలో ముందుకెళ్లనుందని తెలిపారు. కొత్త డీపీఆర్ కోసం భౌగోళిక, సాంకేతిక, పర్యావరణ సర్వేలు మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ డీపీఆర్ పూర్తయ్యాక రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరు, హైదరాబాదుకు తాగునీరు సరఫరా అందించడమ తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్ఘాటించారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను నవీకరించడం, ధృవీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002–2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్–2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ ప్రక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవువుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.

## మహిళా అధికారులకు మంత్రుల వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అలాంటి మంత్రులను కేబినేట్ నుంచి వెంటనే తొలగించాలని అన్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్. రౌడీషీటర్లు పోలీసులపై హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అని ర్ అయ్యారు. ఒక వర్గం ఓట్ల కోసం ఎంఐఎం నేతల కాళ్లు పట్టుకునే దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు బండి సంజయ్ కుమార్. నెలకు రూ.2, 500లు, తులం బంగారం, స్కూటీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. రౌడీషీటర్లు బయటకు రావాలంటేనే గజగజ వణికేలా చేయాలని హెచ్చరించారు. సర్దార్ వల్లభాయిపటేల్ 150వ ఐక్యతా మార్చ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయి పటేల్ చరిత్ర తెలుసుకోవాలని బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## రష్యా చమురు విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

'సెలక్టివ్'గా నిబంధనలు వర్తింపజేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. నీతులు చెప్పేవారు ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటూ ఆసియాన్ సదస్సులో ఆయన వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ సర్కారు 25 శాతం సుంకం విధిస్తున్న సంగతి తెలిసిందే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో భేటీ అనంతరం జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు సరఫరా గొలుసులు క్షీణిస్తున్నాయని, మరోవైపు ఇంధన మార్కెట్లు కుచించుకుపోతున్నాయని జైశంకర్ అన్నారు. మరోవైపు టెక్నాలజీ, సహజ వనరుల కోసం పోటీ వంటి కఠిన సమయాన్ని ప్రపంచం చూస్తోందని పేర్కొన్నారు. మార్కెట్‌లో నెలకొన్న అసాధారణ పరిస్థితుల కారణంగా ఇంధన వాణిజ్యం తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ తరుణంలో కొందరికి మాత్రమే నిబంధనలు వర్తింపజేయడం, ఇతరులకు నీతులు చెప్పేవారు వాటిని పాటించడం లేదంటూ పరోక్షంగా ట్రంప్ సర్కారుకు జైశంకర్ చురకలంటించారు. అంతకుముందు మార్కో రూబియోతో సమావేశమైన ఆయన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు.

## సుప్రీంకోర్టు తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్‌కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూ ర్తిగా ఉన్నారు. గవాయ్ నవం బర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్య కాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో తెలంగాణ భవిష్యత్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంతోనేనని లక్ష్మణ్ అన్నారు.బీహార్‌లో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో గెలువబోతుంది. జంగల్ రాజ్‌గా ఉన్నా బీహార్ ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతుంది.

రాహుల్ గాంధీ విదేశీ కుట్ర దారులతో చేతులు కలిపారు. దేశాన్ని మతాల పేరుతో విడగొట్టి ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారు. ఓటు చోరీ నినాదం కాంగ్రెస్‌కి బూమరంగ్ అయింది. దొంగ ఓట్లను చేర్పించి దొంగే దొంగ అన్నట్టుగా కాంగ్రెస్ అరుస్తుంది. తెలంగాణలో ప్రజలు కాచుకుని చూస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పారదర్శకత, జవాబు దారి పాలన తెలంగాణలో కూడా రావాలని చూస్తున్నారని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో భాజపా విజయానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాంది కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఉప ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో మజ్లిస్–భాజపా మధ్యే పోటీ ఉంటుంది. ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి. ఆ పార్టీని ఆపాలంటే భాజపాను గెలిపించాలి. జూబ్లీహిల్స్‌కు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిందేమీ లేదు. భాజపాను గెలిపించాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని రామచందర్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణం చెందారు. దీంతో జూబ్లీహిల్స్‌కు బైపోల్ అనివార్యమైంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. ఫలితం మాత్రం నవంబర్ 14న విడుదల కానుంది. ఈ ఎన్నికలో కాంగ్రెస్–బీఆర్ఎస్–బీజేపీ నువ్వానేనా? అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ పోటీ పడుతున్నారు.

# బిఆర్ఎస్.. చర్చిలలో ప్రచారం..!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికార దుర్వి నియోగం చేసినట్టే.. ఇప్పుడు కూడా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు బరితెగిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడే కాదు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ పొంగనాలు కొడుతున్నారాని ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరీష్ దొంగతనం చేసి మాగంటి సునీతకు అంటగడుతున్నారని విమర్శించారు. సునీత గెలవడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేనట్టుందని.. ఓడిపోతారని తెలిసే పిచ్చి నాటకాలు వేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిజాయితీగా ఎన్నికల్లో గెలిస్తే హర్షిస్తామని.. బీఆర్ఎస్ నేతలు సునీత మంచి కోసం పని చేయాలన్నారు. కేసీఆర్ గురించి మాట్లాడితే దుబాయ్



శేఖర్ అనే పిలవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాము ఏం చేసినా చెల్లుతుందని బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తన సొంత మీడియాలో ప్రకటనలు ఇస్తోందని.. వాటిని అభ్యర్థి లెక్కలో జమకట్టాలన్నారు. కాంగ్రెస్ క్యాండిడేట్ పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల రూల్స్ ఉల్లం ఘిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. 'ఎన్నికలను ఆదర్శంగా నిర్వహించాలని మేం ప్రయత్నిస్తున్నాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం సరికాదు. చర్చిలలో ప్రచారం చేయడం తప్పు. పోల్ స్లిప్స్ పంచితే చర్యలు తీసుకోవాల్సిందే. జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్‌ను గెలిపించాలని నిర్ణయించు కున్నారు. దొంగ దారిలో గెలిస్తే చర్యలు తప్పకుండా ఉంటాయని హెచ్చరించారు.

# మైనార్టీలను మోసం చేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కానీ ఇక్కడ చెప్పరని విమర్శించారు.

రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. ఇది కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని దుయ్యబట్టారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని ÷ర్ అయ్యారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. హైడ్రా గురించి రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉంటారని విమర్శించారు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగాలని.. వాళ్లు సమాధానం చెప్పలేరని విమర్శించారు. ఇదే విషయంపై కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. 'ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా' అని సమాధానం చెప్పారని.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు నింపే సంస్థలని రాహుల్ గాంధీ విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతలకు లాభం చేకూరుస్తారని ఆరోపించారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తొందరగా ఇక్కడ రేవంత్ అమలు చేస్తారని విమర్శించారు. ఇది బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని అంటూ ఎద్దేవా చేశారు. మహిళలకు ఫ్రీ బస్ అని చెప్పి పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ మాట తప్పిందని.. రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో కూడా వీళ్లు చేసేది ఏమీ ఉండదని కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ షాదీ ముబారక్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టారు.. షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. మేం అంతకంటే ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌కుగా చూస్తోందని ఆరోపించారు. మైనార్టీ స్కూళ్లను కేసీఆర్ ప్రారంభించారని.. మైనార్టీ స్కూల్స్‌తో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారన్నారు. నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు కేసీఆర్ 34కు పెంచారాని.. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చారని.. పదేళ్లలో ఎన్నో పనులు చేశారన్నారు. మోదీ స్కూల్లో చదివానని.. చంద్రబాబు కాలేజీకి వెళ్లానని.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నారని.. చౌకీదార్ చోర్ అని రాహుల్ అంటే.. రేవంత్ రెడ్డి కాదు కాదు.. ఆయన నా పెద్దన్న అని చెబుతున్నాడన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలు అని విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని.. ఒక సంవత్సరం క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీకి రైడ్స్ అయ్యాయని.. ఒకటి కాదు రెండు రోజులు రైడ్స్ అయ్యాయని గుర్తు చేశారు. నోట్లు లెక్కపెట్టే మెషిన్‌లను లోపలికి తీసుకెళ్లిన దృశ్యాలు అంతా చూశారని. అంత జరిగిన తర్వాత ఏమైంది.. ఏమీ కాలేదు.. అంతా సైలెంట్ అంటూ విమర్శించారు.

## బిఆర్ఎస్ హయాంలో గురుకులాల పురోగతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలల స్థాయి దిగజారిందని విమర్శించారు. రెండేండ్లలో 100 మందికిపైగా గురుకుల విద్యార్థులు మరణించారన్నారు.

విద్యార్థుల మరణాలపై కాంగ్రెస్ సర్కార్ కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్షిత(15) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేటీఆర్ స్పందించారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందించారు. వర్షిత ఆత్మహత్య చేసుకోవడం హృదయ విదారకమన్నారు. ఆమె కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేదంటూ మండిపడ్డారు. సానుభూతి, జవాబుదారీతనం అసలే లేవని దుయ్యబట్టారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన మమత, తిరుపతి దంపతుల కూతురు శ్రీవర్షిత (15) వంగరలోని పీవీ రంగారావు తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. దీపావళి సెలవులకు వెళ్లిన శ్రీ వర్షిత ఈ నెల 23న తిరిగి పాఠశాలకు వచ్చింది. గత శుక్రవారం ఉదయం (ఈ నెల 24) పాఠశాల సిబ్బంది సెల్‌ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రు లకు ఫోన్ చేసింది. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ వేధిస్తున్నారని, తనను వెంటనే తీసుకెళ్లాలని, ఇక్కడ ఉండలేనని మొరపెట్టు కున్నది. దీంతో తల్లిదండ్రులు తీసుకెళ్లేందుకు పాఠశాలకు వస్తున్నట్టు బదులి చ్చారు. ప్రార్థనా సమయం కావడంతో విద్యార్థులంతా బయటకు రాగా, శ్రీవర్షిత కనిపించలేదు.

దీంతో డార్మెటరీ హాల్‌కు వెళ్లి చూడగా చున్నీతో ఉరేసుకొని విగత జీవిలా కనిపించింది. కాగా, వర్షిత మృతదేహాన్ని కూడా అంబులెన్సులో కాకుండా ట్రాక్టర్లో తరలించడం తోటి విద్యార్థి నులతో పాటు అందరినీ కలచివేసింది. విద్యార్థినులు రోదిస్తున్న వీడియోను కేటీఆర్ పోస్టు చేశారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో స్పీడ్ పెంచిన ఈడీ

హైదరాబాద్,అక్టోబర్27(అక్షరగళం): రాష్ట్రంలో ఒక్కసారిగా సంచలనం రేకెత్తించిన సృష్టి ఫెర్టిలిటీ కేసుల్లో ఈడీ అధికారులు స్పీడ్ పెంచారు. ఇప్పటికే చంచల్‌గూడ మహిళా జైల్లో రిమాండ్‌లో ఉన్న నిందితులు డాక్టర్ నమ్రత, కల్యాణి, సంతోష్, నందినిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. అలాగేఈ కేసులో ప్రధాన నిందితుడు డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణను సైతం ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. గతంలో సృష్టి ఫెర్టిలిటీకి సంబంధించిన వ్యవహారంలో మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సికింద్రాబాద్ నార్త్ జోన్‌లోని గోపాలపురం పోలీసులను ఆశ్రయించి.. సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి వైద్యురాలి డాక్టర్ నమ్రతపై ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రి చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి రూ. 20 నుంచి 40 లక్షల వరకు నగదును డాక్టర్




నమ్రతా వసూలు చేసినట్లు గుర్తించారు. ఇక అబార్షన్ కోసం వచ్చే మహిళలకు నగదు ఆశ చూపి.. వారి వద్ద నుంచి సైతం పిల్లలను కొనుగోలు చేసినట్లు సమాచారం. మొత్తం 86 మంది పిల్లలను విక్రయించడం ద్వారా.. రూ. 50 కోట్ల నగదు డాక్టర్ నమ్రతా సంపాదించినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం నగదును హవాలా రూపంలో సేకరించింది. వీటితో భారీగా ఆస్తులు కొనుగోలు చేయడమే కాకుండా.. విదేశాలకు సైతం పెద్ద ఎత్తున హవాలా రూపంలో నగదు పంపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

ఆ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు వ్యవహారం బహిర్గమైంది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సోదాల్లో భాగంగా హైదరాబాద్‌లో ఐదు చోట్ల, విజయవాడ, విశాఖపట్నంలో రెండు చోట్ల సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు బ్యాంక్ అకౌంట్లతో పాటు సృష్టి రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు లేని జంటలను లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమ్రతా వ్యవహారాలు నడిపినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

# హైడ్రా పనితీరుపై ప్రజల్లో సంతృప్తి

### దశాబ్దాల సమస్యకు వెంటనే పరిష్కారం

### హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులే నిదర్శనం

హైదరాబాద్,అక్టోబర్27(అక్షరగళం): దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపు తోందంటూ పలువురు తమ పనితీరును ప్రశంసిస్తున్నారని హైడ్రా స్పష్టం చేసింది. కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడంలేదని.. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపింది. సోమవారం ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయని పేర్కొంది. త్వరితగతిన పరిష్కారం లభిస్తున్నందువల్లే ఫిర్యాదులు చేస్తున్నారని వివరించింది. చాలామంది బాహాటంగా ఫిర్యాదు చేస్తున్నారని.. మరి కొంతమంది తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులకు సూచిస్తున్నారని తెలిపింది. కూకట్‌పల్లిలోని హస్మత్‌పేట గ్రామంలో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ తమకు ఫిర్యాదు అందిందని హైడ్రా స్పష్టం చేసింది. తూములు మూసేసి, అలుగులు ఎత్తు పెంచడంతో చెరువు పై భాగంలో ఉన్న భూములు, లే ఔట్‌లు నీట మునగుతున్నాయని కొంతమంది కంప్లైంట్ చేసినట్లు తెలిపింది. మరికొంత మంది చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు వివరించింది. ఈ ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారని తెలియజేసింది. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సాగర్‌రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్




ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియో గిస్తున్నారని అక్కడి నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులోకూడా మట్టిపోసి..

భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు కంప్లైంట్ చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు హైడ్రా ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

## డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన కొమ్ముగోని శ్రీనివాస్ గౌడ్



**వెల్దండ అక్టోబర్ 27 (అక్షర గళం):** నూతనంగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త కొమ్ముగోని శ్రీనివాస్ గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




## మైసిగండి జాతర కరపత్రాల ఆవిష్కరణ

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (అక్షర గళం):** జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి వార్షికోత్సవాలు నవంబర్ 05న (బుధవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. జాతర 10వ తేదీ వరకు అత్యంత వైభవంగా కొనసాగనుంది. ఈ నేపథ్యంలో మైసిగండి మైసమ్మ జాతర కరపత్రాలను సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా దంపతులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే విధంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక వసతి, సౌకర్యాలు తదితర ఏర్పాట్లు చేపట్టుతున్నమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## ప్రజల కోసం ఆలోచించేది కాంగ్రెస్సే

### - టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (అక్షర గళం):** ప్రజల కోసం ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం యూసుఫ్ గూడా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాన్ని ఓటర్లు నమ్మే స్థితిలో లేరని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన స్పష్టం చేశారు. స్థానికుడు, ప్రజల కష్ట సుఖాల్లో



అందరికీ ఎప్పుడూ అండగా ఉండే నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, రామకృష్ణ, పత్య నాయక్, జైపాల్, రాజ్య, పత్య తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 118 వైన్స్ షాప్ టెండర్‌లు

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 27, (అక్షర గళం):** మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 118 వైన్స్ షాప్ టెండర్ లకు సోమవారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆధ్వర్యంలో డ్రా తీశారు. మల్కాజ్ గిరి యూనిట్ పరిధిలోని 88 వైన్స్ షాప్ లకు గాను మేడ్చల్ మల్కాజ్ గిరి అడిషనల్







కలెక్టర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో డ్రా తీశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ ,అసిస్టెంట్ కమీషనర్, మేడ్చల్ ఎక్సైజ్సూపరింటెండెంట్, మల్కాజ్ గిరి సూపరింటెండెంట్, ఇతర ఎక్సైజ్అధికారులు సిబ్బంది ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతగా పూర్తి చేశారు.

## సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

### - మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (అక్షర గళం):** సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలని, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, దళారులకు విక్రయించి మోసపోవద్దని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. సోమవారం తలకొండ పల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస మురుగన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రాన్ని వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ గట్ల కేశవరెడ్డి, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్ రియాజ్, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రేణుక, సీపీఓ రాజీవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్లతో కలిసి చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు పత్తి దిగుబడి తక్కువగా వచ్చినా, సాధారణ తేమ శాతం ఉండడంతో ఇబ్బందులు పడుతుంటారని, ప్రతి ఒక్క రైతు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పత్తిని



సీసీఐ కేంద్రాల్లో విక్రయించి లాభపడాలని అన్నారు. గ్రామీణ రైతులు అనువుగా అమ్ము కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ ను అందుబాటులోకి తెచ్చిందని, గ్రామీణ ప్రాంత రైతులు దళారులకు విక్రయించి నష్టపోకుండా, సీసీఐ కేంద్రానికి అమ్ముకోవాలని పేర్కొన్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం ఉండేలా చూసుకోవాలని, పత్తిని ఆరబెట్టి తీసుకురావాలని తెలిపారు. రైతులు మార్కెటింగ్ అధికారులు ఏర్పాటు చేసిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని పత్తిని సీసీఐ కేంద్రానికి తరలించాలని తెలిపారు. ఆయా మండలాలల్లో వ్యవసాయ అధికారులకు సూచనలు అందించామని, వారిని సంప్రదించాలన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా, అజీమ్, శ్యాంసుందర్ రెడ్డి, కండె రంగయ్య వెంకట్ రెడ్డి, యాదయ్య, సంపత్, రవీందర్, మిల్లు యజమాని సంజీవ్ రెడ్డి, సెంటర్ ఇంచార్జ్ కిచ్య నాయక్ మరియు డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ డిగ్రీ కృష్ణ, యాదగిరి, పాండు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు, నర్సింహా రెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నరేష్ యాదవ్, పురుషోత్తం, రమేష్, శేఖర్, నరేష్, యాదయ్య, మైనార్టీ మండల అధ్యక్షుడు ఆరిఫ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 27, (అక్షర గళం):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టర్లు, (138) దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసల కోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత



మనందరి పైన ఉన్నదని అన్నారు. అదే విధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయా లని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీష్ పూజ పేరుతో ఘరానా మోసం...

### పెట్టిన డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించి...
### ప్రసాదంలో మత్తు పదార్థం కలిపి డబ్బుతో పరారీ...
### నలుగురు నిందితులు అరెస్టు... ఒకరు పరారి

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27, (అక్షర గళం):** అమాయకులను ఆసరాగా చేసుకొని భారీష్ పూజ చేస్తే పెట్టిన డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించి ప్రసాదంలో మత్తు పదార్థం ఇచ్చి డబ్బుతో పారారవుతున్న ముఠాను దుండిగల్ పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి నిందితుల వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఓ ముఠా గండి మైసమ్మలోని బసవరాజు అనే వ్యక్తిని భారీష్ పూజ చేస్తే పెట్టిన డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించారు.

పూజ అనంతరం ప్రసాదం తీసుకోండి అంటూ ప్రసాదంలో మత్తు పదార్థం కలిపి ఇచ్చి స్పృహ కోల్పోయాక రూ.25 లక్షలతో పారారయ్యారు. 21వ తేదీన బాధితుడు దుండిగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

రంగంలోకి దిగిన పోలీసులు మేడ్చల్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి, మేడ్చల్ సీసీఎస్ ఏసీపీ వై. నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో దుండిగల్ సీఐ పి.సతీష్, డిఐ బాల్ రెడ్డి, మేడ్చల్ సీసీఎస్ ఇన్స్పెక్టర్ కిరణ్‌తో బృందాన్ని ఏర్పాటు చేసి ఈ నెల 26న అరెస్టు చేశారు. నిందితుల వివరాలు బహదూర్ పురలో ఉంటున్న మహమ్మద్ ఇఫ్రాన్(44), కామారెడ్డి జిల్లాకు చెందిన గుగోలోత్ రవీందర్(40),




కుత్బుల్లాపూర్‌కు చెందిన కవిరా సాయిబాబా(41), ఖైరతాబాద్‌కు చెందిన ఠాకూర్ మనోహర్ సింగ్(39)ని అదుపు లోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడిగా ఉన్న అబ్దుల్ ఖయ్యుమ్ పారారిలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ. 8,50,000 నగదు, ఎయిర్ గన్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

### కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్

**వెల్దండ అక్టోబర్ 27 (అక్షర గళం):** ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ అన్నారు వెల్దండ మండల పరిధిలోని కోట్ర గ్రామానికి చెందిన తిరుమందాస్ బాల నర్సమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 22,500 వేల చెక్కును బాధితురాలికి కుటుంబ సభ్యులకు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్య కోసం అత్యవసర పరిస్థితులలో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కోట్ర కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు రాజు యాదవ్ నాగయ్య గౌడ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# తప్పనిసరి టీకాలు పశువులకు వేయించాలి

**- పశు వైద్య జిల్లా అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్**



వెల్దండ అక్టోబర్ 27 (అక్షర గళం): వెల్దండ మండల పరిధిలోని కర్రెవానిపల్లి గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరి వేయించాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్ పేర్కొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రైతులతో గాలికుంటు నివారణ టీకాల ఆవశ్యకత ను తెలియజేశారు.

గాలికుంటు వ్యాధి పశువులకు సంక్రమించినప్పుడు, పశువుల ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గుదల వలన రైతులు ఎలా నష్టపోతారో అన్నారు కావున ప్రతి ఒక్క రైతులు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వివినియోగం చేసుకోవాలి అన్నారు అన్నారు కార్యక్రమంలో డాక్టర్ శ్యాంసుందర్, పశువైద్య సిబ్బంది నరసింహ, ఫణిందర్ రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్ రైతులు గొసుల సాయిన్న , విజయేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అధికారులను ఇళ్లకు పిలవడం సిగ్గుచేటు

**- మోసగాళ్లకు,మహిళలకు మధ్య జరుగుతున్న యుద్ధమే జూబ్లిహిల్స్ ఎన్నిక**

**- ఆటో డ్రైవర్లను రోడ్డున పడేసింది కాంగ్రెస్**

**- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

హైదరాబాద్,(అక్షర గళం): మహిళా అధికారులను కొందరు మంత్రులు తమ ఇళ్లకు పిలిపించుకోవడం సిగ్గుచేటని,ఇంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉండదని, కాంగ్రెస్ పాలనలో మహిళలకు గౌరవం లేదని బి ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఈరోజు ప్రవీణ్ కుమార్ ,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శ్రీనగర్ కాలనీ, యూసఫ్ గూడ ప్రాంతంలో ఆటోలో ప్రయాణించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి లతో కలిసి ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్లు రోడ్డు మీద పడ్డారని, నెలనెలా లోన్ ఇచ్చిన ఫైనాన్సర్లు ఇంటి మీదికి వచ్చి గొడవ చేస్తున్నారని,ఇంటి కిరాయి చెల్లించే పరిస్థితి లేదని,పిల్లల ఫీజులు కూడా కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసిఆర్ గారి పాలనలో నెలకు 24 వేలు సంపాదించుకునే ఆటో డ్రైవర్లు నేడు అప్పులపాలై 161 ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం 161 బాధిత కుటుంబాలను కలవలేదని,బాధిత మహిళలను ఓదార్చే దిక్కులేదని విమర్శించారు.

ఆటో డ్రైవర్లు తమ పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నారని, గురుకులాల్లో చదివిద్దామంటే కాంగ్రెస్ ప్రభుత్వం 110 మంది విద్యార్థులను చంపిందని భయపడుతున్నారని పేర్కొన్నారు.

ఇటీవలే మాజీ ప్రధాని పి.వి నరసింహారావు గారి జన్మస్థలమైన వంగర గురుకులంలో శ్రీ వర్షిణి అనే అమ్మాయి మరణిస్తే,శవాన్ని ట్రాక్టర్లో తీసుకెళ్లారని గుర్తుచేశారు. వంగర పాఠశాల మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం అయినప్పటికీ కనీసం బాధిత కుటుంబాన్ని




పరామర్శించడానికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.110 గురుకుల విద్యార్థులు మరణిస్తే కనీసం బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు.

సైదాబాద్ లో ఉన్న జువైనల్ హోం లో పది మంది అమ్మాయిలపై అత్యాచారం జరిగితే, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఎందుకు పరామర్శించలేదని,కనీసం బాధితులకు ఎలాంటి సహాయం అందించలేదని మండిపడ్డారు.

ఆటో డ్రైవర్లను, గురుకుల విద్యార్థులను చంపిన రక్తపు మరకలతో, మరియు మాగంటి గోపినాథ్ చనిపోతే, ఆయన సతీమణి ఏడిస్తే కూడా శంకించే వారు ఈ రోజు జూబ్లిహిల్స్ ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని నిలదీశారు. మహిళలను అవమానిస్తూ, వేధించే రౌడీలకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందన్నారు.వారు గెలిస్తే మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం జూబ్లిహిల్స్‌లో జరిగేది సునీత, నవీన్ యాదవ్ మధ్య యుద్ధం కాదని, మహిళలకు మరియు రాష్ట్రంలో అధికారంలో ఉన్న మోసగాల్లకు మధ్య యుద్ధమన్నారు. ఈ యుద్ధంలో మహిళలు గెలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు ముఖ్యంగా జూబ్లిహిల్స్ ప్రజలు ఈ మోసపు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే, కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.



# రేవంత్ హయాంలో 161 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్య

**- ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలిపిన కేటీఆర్**

**- ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆయన స్వయంగా ఆటోలో ప్రయాణించిన కేటీఆర్**

హైదరాబాద్,(అక్షర గళం): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలియజేశారు. ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆయన స్వయంగా ఆటోలో ప్రయాణించి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఆటో డ్రైవర్ల దయనీయ పరిస్థితిని కేటీఆర్ వివరించారు. తాను ప్రయాణించిన ఆటో డ్రైవర్ మస్రత్ అలీ ఎన్నో విషయాలను చెప్పారని అన్నారు.

మస్రత్ అలీకి రెండు ఆటోలు ఉండేవి, కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాటిని అమ్మాల్సి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. "ఇప్పుడాయన రోజుకు వెయ్యి నుంచి పన్నెండు వందల రూపాయలకే సంపాదిస్తున్నారని వెల్లడించారు. అందులో ఆటో కిరాయి నాలుగు వేలు కట్టాల్సి వస్తోందని.. ఇక.. పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు వచ్చే ఆదాయం సరిపోవడం లేదని మస్రత్ అలీ బాధపడినట్లు చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఇప్పటి వరకు 161 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తీవ్రంగా మండిపడ్డారు కేటీఆర్. ఇదే విషయాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని అసెంబ్లీలో డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఫైరయ్యారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉన్న రూ.5 లక్షల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. మూడు రంగుల జెండా కింద ఆటో అన్నల మూడు చక్రాలు నలిగిపోయాయని అన్నారు.ఇక.. ఇప్పుడు తెలంగాణలో అహనా పెళ్లంటా సినిమా లా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఓట్లు దండుకుందని ఆరోపించారు. తులం బంగారం ఇస్తామని చెప్పి.. మెడలో ఉన్న గొలుసు కూడా లాక్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు ఇలా ప్రతి ఒక్కరూ కష్టాల్లో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందని అన్నారు కేటీఆర్. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో డబ్బులు పంచి ఓట్లు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తోందని.. ప్రజలు ఆ డబ్బులు తీసుకున్నా, ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని సూచించారు. 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లు తీసుకునే నిర్ణయంతో నాలుగు కోట్ల మంది ప్రజలకు మంచి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



నెలకు 2500 చొప్పున ఒక్కొక్క యువతికి కాంగ్రెస్ ప్రభుత్వం 60వేలు బాకీ పడిందని.. ఆటో అన్నలకు.. వృద్ధులకు ఇలా అందరికీ రేవంత్ సర్కార్ బాకీ పడిందరి గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు ఈ ఎన్నికల కోసం డబ్బులు ఇస్తే.. వాటిని కూడా తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎక్కడా అని ప్రశ్నించండని చెప్పారు.

ఇక.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేందుకు ఎన్నో కుట్రలకు పాల్పడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. కారును పోలిన గుర్తులను కొందరు అభ్యర్థులకు కేటాయించి.. ఓటర్లను కన్ఫ్యూజ్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కారు గుర్తు పై నుంచి మూడో నెంబర్‌లో ఉంటుందని, అందరూ జాగ్రత్తగా ఓటేయాలని సూచించారు.

కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో షాక్ ఇస్తేనే మనకు వాళ్లు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని తెలిపారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే మాగంటి సునీతకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

## భారత్ పరువు తీస్తున్న వీధి కుక్కలు!


**- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: దేశంలో వీధి కుక్కల ఉన్మాదం... పెరిగిపోయి భారత ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతీసిందని సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కలు మానవులపై జరిగే క్రూరత్వం గురించి ఏమంటారు? అని పిటీషనర్లను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇంకా సుప్రీం కోర్టు జస్టిస్ విక్రమ్ నాథ్ ఏమన్నారంటే... కుక్కల దాడులు పెరగడం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి సంఘటనలు నిరంతరం జరుగుతున్నాయి. మన దేశాన్ని విదేశీయులు తక్కువ చేసి మాట్లాడటానికి కుక్కల బెడద కూడా కారణం. వీధి కుక్కల సమస్యపై సుప్రీం నియమాలను అమలు చేసే చర్యలపై అఫిడ విట్‌లు సమర్పించని రాష్ట్రాల సిఎస్‌లకు సుప్రీంకోర్టు సమ్మన్లు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలను సమన్లు జారీ చేసింది. గత ఆగస్టు 22న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ ఆదేశాల అమలు వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పిం చాలని, తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అఫిడవిట్ లను ఎందుకు సమర్పించలేదో వివరణ ఇవ్వాలని కూడా సిఎస్ లను ఆదేశించింది.

# బీఆర్ఎస్ పాలనలోనే సబ్సిడీలు, బెనిఫిట్స్

**మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు**

జూబ్లీహిల్స్, అక్టోబర్ 27, (అక్షర గళం): బీఆర్ఎస్ పాలనలో లభించిన సబ్సిడీలు, బెనిఫిట్స్ అన్నీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆటో ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.అనంతరం ఆటో ర్యాలీ గోకుల్ థియేటర్ నుండి ప్రారంభమై, జూబ్లీహిల్స్ టీఆర్ఎస్ పార్టీ భవన్ వద్ద ముగిసింది.ఈ సందర్భంగా నాయకులు ప్రజలతో మమేకమై పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.నాయకులు మాట్లాడుతూ "ప్రజల అభివృద్ధి కోసం, తెలంగాణ ప్రగతిని కొనసాగించేందుకు బీఆర్ఎస్ పార్టీనే సరైన ఎంపిక" అని పిలుపునిచ్చారు.అలాగే వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ తెలిపారు .కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసింది. వాహన యజమానులకు ఇచ్చిన హామీలు ఎక్కడా నిలబెట్టుకోలేదన్నారు.



ఆటో డ్రైవర్ కుటుంబాలు మరోసారి ఆర్థిక కష్టాల్లోకి నెట్టబడ్డాయన్నారు. ప్రజలపై భారాలు పెరిగాయి, పెట్రోల్ ధరలు, జీవన వ్యయాలు అన్నీ పెరిగిపోయాయి.ప్రజల ఆత్మగౌరవం కాపాడేది, కష్టపడే వర్గాలకు అండగా నిలిచేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమే" అని తెలిపారు.

# సచివాలయంలో రివ్యూలు ఎందుకు పెట్టడం లేదు?

- **మహిళలను అవమానించడమే ఇందిరమ్మ రాజ్యమా?**
- **బుద్ధ భవన్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ లేకపోవడంతో సెక్రటరీకి ఫిర్యాదు లేఖను అందజేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా నేతలు**

హైదరాబాద్,(అక్షర గళం): మంత్రులు మహిళా అధికారులను ఇంటికి పిలుచునికి సమీక్షలు చేస్తున్నారని, మహిళా అధికారులు ఇబ్బందులు పడుతున్నారని వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలను, ఎమ్మెల్యేలను, అధికారులను, ఎమ్మెల్యేలను మంత్రులను అగౌరవ కారుస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అన్నారు.మహిళలను అవమానించడమే ఇందిరమ్మ రాజ్యమా అని అడుగుతున్నాం. మహిళా అధికారులను మంత్రులు ఇంటికి పిలుచుకొని రివ్యూ చేశారని వచ్చిన వార్తలపై విచారణ చేపట్టాలని మహిళా కమిషన్ కి ఫిర్యాదు చేశాం. గత ప్రభుత్వంలో సి ఎస్ శాంతి కుమారి కి ఉన్నత పదవి కట్టబెట్టాం. కానీ ఈ ప్రభుత్వం అనేక విధాల మహిళా అధికారు లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళా ప్రజాప్రతినిధుల పై కూడ గౌరవం లేకుండా మాట్లాడుతున్నారు. సీఎం వద్దకు వెళ్ళాలి అంటే తన తల్లి మహిళ మంత్రి భయపడుతున్నారని ఆమె కూతురు ఆరోపించారు. మహిళా జర్నలిస్టుల పై దాడులు చేశారు. కేసులు పెట్టారు. కొత్తగూడెం లో గిరిజన మహిళను వివస్త్ర చేసిన ఘటన వెలుగు చూసింది.

సీఎం ఢిల్లీ నివాసంలో కలిసే అవకాశం కూడా ఇవ్వకుండా అవమానించారు. మహిళలను కోటీశ్వరులు చేయకపోయినా పర్వాలేదు. మహిళల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరించవద్దు. గురుకులాల్లో విద్యార్థినులు వేధింపులకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఏం అయ్యాయి?

మహిళా అధికారులను ఇండ్లకు పిలవకుండా స్వేచ్ఛగా పనిచేసేలా పరిస్థితులు కల్పించాలి. మహిళా అధికారులను వేధించకండి. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను బలి చేయకండి.

పత్రిక ప్రకటనల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసి



విచారణ చేయాలి. మహిళలను ఇండ్లకు పిలిచి సమీక్షలు చేయడం ఏంటి? సచివాలయం బ్రహ్మాండంగా నిర్మించారు. అందులో రివ్యూలు ఎందుకు పెట్టడం లేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థి సునీత కన్నీరు పెట్టుకుంటే, మంత్రులు అవమానించారు. మిస్ వరల్డ్ కంటెస్టెంటట్లను ఇబ్బందులు పెట్టారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు.

# కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పు

**పదేళ్లు దండుపాళ్యం బ్యాచ్ లాగా దోచారు**

**మరోమారు హరీష్ రావుపై మండిపడ్డ మంత్రి అడ్లూరి**

హైదరాబాద్,అక్టోబర్27 (అక్షర గళం): కవిత చేసిన ఆరోపణలకు ముందు హరీష్ రావు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మండిపడ్డారు. మీ కుటుంబంలో గొడవలు పెట్టుకుని.. మంత్రివర్గాన్ని విమర్శించడమేంటని మండిపడ్డారు. మేమే రాజులం.. మేమే మంత్రులం అన్నట్లుగా పరిపాలన చేశారు. పదేళ్లు పాలించిన హరీశ్‌రావు.. రాష్ట్ర కేబినెట్‌లో పంపకాల గురించి మాట్లాడుకున్నారంటూ మాట్లాడతారా? నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తారా? అబద్దాలు పదిసార్లు చెప్పి నిజం అని నమ్మించే పనిలో హరీశ్‌రావు ఉన్నారని అంటూ మంత్రి ధ్వజమెత్తారు. కేబినెట్ మంత్రులపై చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. 'దండుపాళ్యం అని మమ్మల్ని అంటున్నావు.. పదేళ్లు మీరు స్టువర్టుపురం దొంగల్లా పంచుకున్నారా..?, పదేళ్లు మీ కేబినెట్‌లో అసలు మాట్లాడే అవకాశమే లేదు కదా..? ఐతే మీరు.. మీ బామ్మర్ది? మీ మామే కదా..? మాట్లాడింది. కనీసం హోంమంత్రిని కూడా ప్రజా భవన్‌కు రానియని చరిత్ర మీది. సామాన్య కార్యకర్తలే ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారు. దళితులు.. బలహీన వర్గాల బిడ్డలం కేబినెట్‌లో ఉన్నాం. బడుగు.. బలహీన వర్గాలు అంటే నీకు ఎందుకు అంత చిన్నచూపు.



కేబినెట్ మీద విషం కక్కినావు. హరీశ్‌రావు నామినేషన్ వేసే సిద్దిపేట వేంకటేశ్వర స్వామి ఆలయంకి రమ్మంటే తోక ముడిచాడు. హరీశ్‌రావు? అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వస్తా అని.. ఇప్పటి మేము కాదు.. మా కొప్పుల ఈశ్వర్ వస్తాడు అంటున్నారు. తోక ముడిచావు హరీశ్‌రావు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడటం మానుకో అంటూ మంత్రి లక్ష్మణ్ హితవు పలికారు.

# మద్దతు ధరలతో పంటల కొనుగోళ్లు

**కేంద్రమంత్రి చౌహాన్‌ను కోరిన తుమ్మల**

హైదరాబాద్,అక్టోబర్27(అక్షర గళం): కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ(సోమవారం) వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రైస్ సపోర్టు స్కీమ్ కింద పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



తెలంగాణ రాష్ట్రంలో పెసర, మినుము పంటలను వందశాతం వరకు, సోయాబీన్‌ను 50శాతం వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు మంత్రి తుమ్మల. మొక్కజొన్న, జొన్న పంటలను కూడా ప్రైస్ సపోర్టు స్కీమ్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. మరోవైపు... ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకి మంత్రి తుమ్మల పలు సూచనలు చేశారు. రోడ్లు, కొనుగోలు కేంద్రాల వద్ద నేలపై ధాన్యం ఉంచవద్దని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డుకు, జిన్నింగ్ మిల్లులకు తీసుకురావడానికి ముందు పత్తిలో తేమశాతం 12 శాతం మించకుండా చూసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. 12 శాతం మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదని చెప్పుకొచ్చారు. మార్కెట్ యార్డు, జిన్నింగ్ మిల్లులకు రాకముందే తేమ శాతం చెక్ చేసుకోవాలని సూచించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమశాతం ఎక్కువ ఉన్నా పత్తి పంట కొనాలని కేంద్ర ప్రభుత్వంపై తాము ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు నిన్న(ఆదివారం) లేఖ రాశామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పత్తి రైతులకు గరిష్ట మద్దతు ధర అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుందని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు పత్తి రైతులు తేమ శాతం 12 శాతం మించకుండా చూసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు.

# జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరిన కేసు

### కోర్టు ధిక్కరణ చర్యలకు విముఖత

**న్యూఢిల్లీ,అక్టోబర్27(అక్షర గళం):** సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటనపై కేసు నమోదుకు జస్టిస్ గవాయ్ విముఖత చూపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయరాదని నిర్ణయించారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కోర్టు ధిక్కార చర్యలకు అనుమతించబోమని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఈ విషయంపై సీజేఐ ఎటువంటి కేసు నమోదు చేయలేదని.. అతడిపై చర్యలు తీసుకోవడానికి భారత ప్రధాన న్యాయమూర్తి విముఖత చూపారని తెలిపింది. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కోర్టులో నినాదాలు చేయడం, బూట్లు విసిరేయడం వంటి చర్యలు కోర్టు ధిక్కారానికి సంబంధించిన కేసులని.. అయితే వీటిపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలా, వద్దా అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ధిక్కార నోటీసులు జారీ చేయడం వల్ల సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదికి అనవసర ప్రాధాన్యం కల్పించినట్లు అవుతుందని అభిప్రాయం వ్యక్తంచేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తామని సుప్రీం వెల్లడించింది. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని అతడిని బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ



స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. ఈ ఘటనను ప్రధాని మోదీతో సహా పలు రాజకీయ పార్టీల అగ్రనేతలు, న్యాయవాదుల సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. అనంతరం సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ ఆ న్యాయవాది సభ్యత్వాన్ని రద్దు చేసింది. న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది.

# సమన్వయంతో మొంథా తుఫాన్ తాకిడిని ఎదుర్కోవాలి

### ప్రతి సచివాలయానికి ఒక పోలీస్‌ను కేటాయించాలి
### ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు
### జేసీబీలు, డ్రోన్లను అందుబాటులో ఉంచుకోవాలి
### అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

**విజయవాడ,అక్టోబర్27(అక్షర గళం):** జిల్లాలోని అన్ని శాఖల సిబ్బంది పూర్తి సమన్వయంతో, ఏకతాటిపై ఉండడం ద్వారా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులతో కలెక్టర్, పోలీస్ కమిషనర్ దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లా డుతూ.... ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో ప్రత్యేక ప్రతిస్పందన బృందాలు ఉండాలన్న ముఖ్యమంత్రి సూచన మేరకు ఇప్పటికే బృందా లను ఏర్పాటు చేశామని చెప్పారు. వారంతా క్షేత్రస్థాయిలో పర్యటించి, తుపాను ముప్పు ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడని వారిని తుపాను ప్రమాద తీవ్రత తెలిపి ఒప్పించాలని సూచించారు. మైకులలో అనౌన్స్ మెంట్ ద్వారా ప్రజలకు తుపాను ప్రమాద తీవ్రతను తెలియజేయాలన్నారు. తహసిల్దారులు, పోలీస్ సిబ్బంది కలసి తుపాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించాలన్నారు.



గర్భిణులు, అనారోగ్యంగా ఉన్న వారిని వెంటనే తరలించాలని చెప్పారు. పాత వీడియోలతో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై దృష్టిపెట్టాలని.. తప్పుడు ప్రచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ అంశంపై దృష్టి సారించాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజ శేఖర్ బాబు మాట్లాడుతూ... కొండ చరియల ముప్పు ఉన్న ప్రాంతాల్లో 365 ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న 7 ఇండ్లను గుర్తించినట్లు చెప్పారు. ఆ ఇళ్లలోని ప్రజలను ఒప్పించి పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. వాగులు, వంకలు పొంగినప్పుడు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోప్ లు కట్టాలని చెప్పారు. డ్రోన్లను వినియోగించాలని, అవసరమైన ట్రాక్టర్లు, జెసిబిలను ముందే సమకూర్చుకోవాలని సూచించారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొండ ప్రాంతాలు, బుడమేరుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. సమిష్టి కృషితో తుపా నును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించ వచ్చని చెప్పారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ (జేసీ) ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కే ఆర్ సి సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, డిసిపిలు సరిత, తిరుమలేశ్వర్ రెడ్డి, ఉమామహేశ్వరరాజు, ఏసీపీ భానుప్రకాశ్‌రెడ్డి, ఏసీపీ పావన్ కుమార్, డి ఆర్ డి ఏ పీడీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరకామణి చోరీకేసులో కీలక పరిణామం

### సిఐడి దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు
### టీటీడీ బోర్డు, అధికారుల పాత్రపై కూడా దర్యాప్తు
### ప్రధాన నిందితుడు రవికుమార్ ఆస్తులపై ఎసిబి దర్యాప్తు

**అమరావతి,అక్టోబర్27(అక్షర గళం):**

తిరుమల పరకామణిలో చోరీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం వ్యవహారం పై దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశించింది. డైరెక్టర్ జనరల్ స్థాయికి తగ్గని అధికారిని ఐవోగా నియమించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. పరకామణి కేసు రాజీ వ్యవహారంలో టీటీడీ బోర్డు, అధికారుల పాత్ర పై కూడా దర్యాప్తు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్ ఆస్తుల పై దర్యాప్తు చేయాలని డైరెక్టర్ జనరల్ ఏసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రవికుమార్, కుటుంబ సభ్యుల స్థిర,చర ఆస్తులతో పాటు బ్యాంక్ ఖాతాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. వారికి సంబంధించిన ఆస్తులను రిజిస్ట్రేషన్ ద్వారా వేరే వారికి ఏమైనా బదలాయించారా? అనే విషయం పై కూడా దర్యాప్తు చేపట్టి.. నివేదికను తదుపరి విచారణలోగా కోర్టు ముందు ఉంచాలని ఏసీబీ, సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 2కి వాయిదా వేసింది. తితిదే పరకామణి వ్యవహారంపై సీఐడీ దర్యాప్తునకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. చోరీపై నమోదైన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై ఉన్నత న్యాయస్థానం కీలక ఉత్తర్వులు ఇచ్చింది.

చోరీకి పాల్పడిన రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. కేసు రాజీ వ్యవహారంలో తితిదే బోర్డు, అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు పరిశీలించాలంది. ఆస్తులు



బదలాయించారా? అనే అంశంపైనా దర్యాప్తు చేయాలని పేర్కొంది. నివేదికను తదుపరి విచారణలోగా అందించాలని సీఐడీ, ఏసీబీని ఆదేశించింది.

వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై 2023లోనే తితిదే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది.

ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి తితిదే అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోక్ అదాలత్‌లో రాజీ చేయించారు. ఈ ఘటనపై పిటిషన్ దాఖలు కావడంతో హైకోర్టు విచారణకు స్వీకరించింది.

# దూసుకొస్తున్న మొంథా తుఫాన్

### సిఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ ఫోన్
### అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ
### లోకేశ్‌కు ప్రధాని కార్యాలయంతో సమన్వయ బాధ్యతలు
### మంత్రులు అధికారులతో సమీక్షించిన చంద్రబాబు

**అమరావతి,అక్టోబర్27(అక్షర గళం):** మొంథా తుఫాన్ రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో పలు అంశాలపై సీఎంతో ప్రధాని చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలను మోదీకి చంద్రబాబు వివరించారు. అనంతరం ఆర్టీజీఎస్‌లో మంత్రులు లోకేశ్, అనిత, సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి లోకేశ్‌కు సీఎం సూచించారు. ప్రతి గంటకూ తుపాను కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి. కాల్వ గట్లు పటిష్ఠం చేసి పంటలకు నష్టం జరగకుండా చూడాలి. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలి. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు చేపట్టింది. ఇక మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్లో మాట్లాడారు. కేంద్ర సాయం పూర్తి స్థాయిలో ఉంటుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఇక మొంథా తుఫాను ప్రభావంపై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. తుఫానుపై ఆర్టీజీఎస్‌లో మంత్రులు, అధికారులతో చర్చించారు.

ప్రతీ గంటకు తుఫాన్ కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలు, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కాలువ గట్లు పటిష్టం చేసి పంట నష్టం జరగకుండా చూడాలని అధికారులకు చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, సీఎస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోవైపు ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ దూరంలో ఉన్న మొంథా తుఫాన్.. 16 కి.మీ వేగంతో తీరాన్ని సమీపిస్తోంది. దీని ప్రభావంతో కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాలకు భారీ వర్షాలు పడనున్నాయి. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది

- ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడు
- రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్ కి వచ్చి సినిమా యాక్టర్లకంటే ఎక్కువ యాక్టింగ్ చేశాడు
- ఆరోజు రాహుల్ గాంధీ హైదరాబాదుకు వచ్చి ఇదే యూసఫ్ గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు
- కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 12000 ఇస్తామని మోసం చేసింది
- వెంటనే బాకీ పడ్డ 24 వేల రూపాయలు ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం
- మొత్తం ఆటో కార్మికులకు రెండు సంవత్సరాల బాకీ చెల్లించినా 1500 కోట్లు అవుతుంది
- 3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై 3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి
- అందులో నుంచి 1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి ఆటో కార్మికులను కాపాడాలని మా డిమాండ్
- రేవంత్ రెడ్డి గురువు ఆంధ్ర ప్రదేశ్ లో ఆటో డ్రైవర్లకు 15,000 ఇస్తున్నారు
- ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుంచి ఆటోలో తెలంగాణ భవన్‌కి చేరుకున్న మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, (అక్షర గళం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలు ఆందోళనలో ఉన్నారు. రైతులు కావచ్చు. చిరు ఉద్యోగులు కావచ్చు. మహిళలు కావచ్చు. ఆటో డ్రైవర్లు కావచ్చు. అందరూ ఆవేదనలో ఉన్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. పేరుకి ఉచిత బస్సు అన్నాడు. ఆడోళ్ళకి ఫ్రీ అన్నారు. మొగోళ్ళకి డబల్ టికెట్ కొడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి కుటుంబం మీద భారం వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదుసార్లు బస్ చార్జీలు పెంచింది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్ కి వచ్చి సినిమా యాక్టర్లకంటే ఎక్కువ యాక్టింగ్ చేశాడు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో మెట్ల మీద కూర్చొని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి ఏడాది 2,00,000 ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు.

నిరుద్యోగులను వాడుకొని వేడుకొని ఓట్లు, డబ్బులు తీసుకొని ఈరోజు నిరుద్యోగ యువతీ యువకులను వదిలేశారు రాహుల్ గాంధీ. ఆరోజు రాహుల్ గాంధీ హైదరాబాదుకు వచ్చి ఇదే యూసఫ్ గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 12000 ఇస్తామని చెప్పారు. ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్ అసలే లేదు. ప్రమాద బీమా 10 లక్షల పెంచుతామని పత్తా లేదు. ఇస్తామన్న 12 వేల రూపాయలకి దిక్కు లేదు. ఐదు నుంచి ఆరు లక్షల ఆటోలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క ఆటోకు 24 వేల రూపాయలు బాకీ పడింది. 24 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు చెల్లించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది.

ముఖ్యమంత్రి, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు కదా. వాటికోసం పైసలు ఉన్నాయి. కానీ ఆటో కార్మికులకు నెలకు ?1000 ఇవ్వడానికి లేవా? నెల నెల మూటలు మోస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నాడు రేవంత్ రెడ్డి.ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు నీకు అంత చిన్న చూపు?

లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం. లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు కానీ ఆటో డ్రైవర్లకు నెలకు వేయి రూపాయలు ఇవ్వలేవా రేవంత్ రెడ్డి? రాహుల్ గాంధీ.. ఓట్ల కోసం ఆటో ఎక్కి తిరిగావు ఇప్పుడు ఆటో కార్మికుల కష్టాలు పట్టవా? మరోసారి రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే శంషాబాద్ లో ఆటోలతో నిరసన తెలుపుతాం.

ఈరోజు రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో కార్మికుల బాధ తెలివాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంటనే బాకీ పడ్డ 24 వేల రూపాయలు ప్రతి ఆటో డ్రైవర్ కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. మొత్తం ఆటో కార్మికులకు రెండు సంవత్సరాల బాకీ చెల్లించినా 1500 కోట్లు అవుతుంది.

3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై 3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. అందులో నుంచి 1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి ఆటో కార్మికులను కాపాడాలని మా డిమాండ్. ఇప్పటివరకు 161 ఆటో కార్మికులు చనిపోయారు. ఆ కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయి. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి పది లక్షల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. ఆటో కార్మికులు ఎవరూ చనిపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పకుండా మిమ్మల్ని కాపాడుకుంటాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆటో






కార్మికులు ఎక్కడ ఉన్నా కాంగ్రెస్‌ని ఓడించే విధంగా పనిచేయండి. ప్రతి ఆటో అన్న రెండు ఫోన్లు చేసి మీ బంధుమిత్రులకు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పండి. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడు. రేవంత్ రెడ్డి గురువు ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు 15,000 ఇస్తున్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లందరికీ బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంది. అసెంబ్లీలో ఆటో డ్రైవర్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి అసెంబ్లీని స్తంభింపజేస్తాం. ఆటోలకు క్వార్టర్లీ టాక్స్ కేసీఆర్ రద్దు చేశారు. కేసీఆర్ మళ్ళీ వస్తారు. ఆటో డ్రైవర్ ల కష్టాలు తీరుస్తారు.

### ఆటో డ్రైవర్లకు 12000 ఇస్తామని చెప్పి మోసం చేసింది: ఆటో డ్రైవర్ రమేష్

హరీష్ రావు ప్రయాణించిన ఆటో డ్రైవర్ రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆటో డ్రైవర్ల జీవితం బాగుండేది. రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకం పెట్టి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టాడు. ఆటో డ్రైవర్లు అప్పుల బాధతో చనిపోతున్నారు. వారి కుటుంబాలు దిక్కులేని వారు అవుతున్నారు. హరీష్‌రావు మా అందరి కోసం వచ్చి మాకు సంఘీభావంగా ఆటోలో ప్రయాణించారు. రోజుకి 500 రూపాయలు ఇప్పుడు వస్తున్నాయి. గతంలో 1500 నుండి 2 వేల రూపాయల వరకు వచ్చేది. సంవత్సరానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 12000 ఇస్తామని చెప్పి మోసం చేసింది.

### కేసీఆర్ ఉన్నప్పుడు మా ఆటోడ్రైవర్ల జీవితాలు బాగుండేది: షేక్ నజీబ్

షేక్ నజీబ్ అనే మరో ఆటో డ్రైవర్ మాట్లాడుతూ.. నా కొడుకుకు ఆరోగ్యం బాగా లేక నీలోఫర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాము. ప్రతి మందులు బయట కొనుక్కొని తేవాల్సి వస్తున్నది. కనీస మందులు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇవ్వడం లేదు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలో బాగుండేది. మా ఆటో డ్రైవర్ల జీవితాలు బాగుండేది. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల కరెంటు వచ్చింది. షాదీ ముబారక్ వచ్చింది.

రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలో ఒకటి కూడా అమలు కాలేదు. ఈరోజు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడిస్తాం. ఒక్కొక్క ఆటో డ్రైవర్ పదిమందిని తీసుకెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయిస్తాం. మాగంటి సునీతని గెలిపిస్తాం.

పది సంవత్సరాల్లో ఆటో డ్రైవర్లు సంతో షంగా ఉండేటోళ్లు.పోలీస్ వేధింపులు చాలన్లు కట్టే పరిస్థితి లేకుండే. ఇప్పుడు పోలీసులకు చాలాన్లు కట్టడానికి సరిపోతున్నది మా సంపాదన.

# ఢిల్లీలో రోజురోజుకూ క్షీణిస్తున్న గాలి నాణ్యత

### తీవ్రమైన వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు
### ఆస్పత్రుల్లో పెరుగుతున్న శ్వాసకోస కేసులు

**న్యూఢిల్లీ,అక్టోబర్27(అక్షర గళం):**

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణెళిశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించ వచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఏఖిఐ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఏఖిఐ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఏఖిఐ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# సంపాదకీయం..

## ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు?

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు.

ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు.ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో



నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు.అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించ గలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్దం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధ్, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

## టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్

టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారని మంత్రి టీజీ భరత్ తెలిపారు. అనంతపూర్, కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కానుందని చెప్పారు. ప్రధాని మోదీ వస్తున్నందున చాలా అంచనాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాటి రాజధాని కర్నూలుపై ప్రధాని మోదీకి అవగాహన ఉంటుందని చెప్పారు. కర్నూలుకి మోదీ వరం ఇస్తారని తాను ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. జిఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చాలా మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ కోరారు. ప్రధాని మోదీ రాక కోసం కూటమి ప్రభుత్వం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాని సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కడపలో మహానాడు.. అనంతపురంలో సూపర్ సిక్స్ సభలు సక్సెస్ అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలును డ్రోన్ హబ్‌గా కూటమి ప్రభుత్వం మార్చనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాంతర అభివృద్ధి జరగాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని వివరించారు. కూటమి సర్కారు అన్ని జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వీరంతా ప్రధాని రాక సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించారు. 16న ప్రధాని పర్యటించే ప్రాంతాలను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు.

# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యద్భుత నరగంగా అమరావతి రాజధాని నిర్మాణం కాబోతున్నదని సిఎం చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో కానీ, మన రాజధాని అమరావతి అంతకుమించి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని, మనభవిష్యత్ ఆశలకు తార్కాణంగా ఉంటుందన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. భూములు ఇచ్చిన రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితిలో విభజన జరిగింది. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఇక్కడి రైతులు కూడా బాగుపడతారని హామీ ఇస్తున్నానని అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు.




రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని.. గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది ఇక్కడ పారుతోందని, ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్‌డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి.

అమరావతి కన్నా విశాఖ ముందుకు వెళుతోంది. అమరావతికి శంకుస్థాపన సమయంలో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి నీరు తెచ్చారు. పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని ప్రధాని తెచ్చారు. అందుకే అమరావతి నిలిచింది. రైతులను నేను మరిచిపోను.. మరిచిపోతే త్యాగాన్ని మరిచిపోయినట్టే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంతో ఆదాయం సృష్టిస్తుందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు తెలంగాణకు 70శాతం ఆదాయాన్ని సమకూరుస్తోందని అన్నారు.

కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశాఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# పారదర్శకతే ఇసికి శ్రీరామరక్ష

బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఓటర్ల జాబితా కొన్ని వర్గాల్లో ఉపశమనం కలిగించినా, మరి కొన్ని వర్గాల్లో తీవ్ర అశాంతి రేకెత్తించింది. గత మంగళవారం విడుదలైన తుది జాబితా, సామూహికంగా ఓటర్ల తొలగింపు భయాలు మొదట్లో భయపడిన స్థాయిలో లేకపోయినా, ఈ ప్రక్రియ దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్య భవిష్యత్ గురించి అత్యవసర ప్రశ్నలను లేవనెత్తింది. సుప్రీం కోర్టు జోక్యం ఎన్నికల కమిషన్ ను మరింత పారదర్శకత వైపు నడిపించగా, ప్రతిపక్షాలు అప్రమత్తమైన పాత్ర పోషించడంతో బీహార్ సర్ దారుణ ఫలితాలను తప్పించింది. కానీ ఈ కసరత్తు ఎన్నికల ప్రక్రియలను ఎలా ఆయుధంగా ఉపయోగించవచ్చో, భారతదేశం అంతటా ఇలాంటి సవరణలు చేపట్టే ముందు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే అంశంలో ఓ హెచ్చరిక కథగా మిగిలిపోయింది. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు సంఖ్యాపరంగా మాత్రమే ప్రమాదంలో పడలేదు. భారత ప్రజాస్వామ్య సమగ్రతే ప్రమాదంలోపడింది.ఓటర్ల జాబితా సవరణలో తలెత్తిన సమస్యలు, జాతీయ స్థాయిలో పునరావృతమైతే, సార్వత్రిక ఓటు హక్కు అనే అంశాన్నే అస్థిరతలో నెట్టివేయవచ్చు. ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వలసదారులు, పేదలను లక్ష్యంగా చేసుకుంటూ పాలక వర్గాల పట్టును మరింత బలోపేతం చేస్తుంది.

బీహార్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓటర్ల జాబితాలను సంస్కరించడం, చనిపోయిన వారి పేర్లు, వలసపోయిన వారి పేర్లు, నకిలీ పేర్లను తొలగించే లక్ష్యం తో చేపట్టింది.అయినా రాజకీయం లోపాయికారిగా అంతర్గతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, దాని అనుబంధ శక్తులు ఈ కసరత్తును అక్రమ వలసదారులు, చొరబాటుదారులు -ఘుస్పైటియాస్ - తొలగించే మార్గంగా చూపాయి. కానీ ఈ పదాలు ముఖ్యంగా మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలను లక్ష్యం చేసుకునే ఆయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. మొదట్లో ఈ ప్రక్రియతో భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపునకు దారితీస్తుందనే భయాలు ఉన్నాయి. బీహార్ ఓటర్ల జాబితాలో జూన్ నాటికి 7 కోట్ల 89 లక్షల మంది ఓటర్లు ఉండగా, అక్టోబర్‌లో ప్రచురించిన తుది జాబితాలో 7 కోట్ల 42 లక్షల మంది ఉన్నారు. అంటే దాదాపు 6 శాతం మందిని తొలగించారు. చనిపోయిన వారి పేర్లను, వలసదారులు, నకిలీల పేర్లు తొలగించామని అధికారులు వివరణ ఇచ్చారు. కానీ, 68.6 లక్షల మంది పేర్ల తొలగింపు ఆశ్చర్యాన్ని కలిగించింది. తీవ్ర పరిణామాలకు దారితీసింది. మెజారిటీ తొలగింపులు చట్టబద్ధమైనవే అయినా, బలహీనమైన డాక్యుమెంషన్‌లో పలువురి తొలగింపు వాస్తవమే.

బీహార్ కేసులో బహుళ శక్తుల జోక్యం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సర్ చేపట్టిన సమయం, దాని ఫార్మెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ఆధార్ ను అందుబాటులో ఉన్న రుజువుగా చేర్చాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ప్రతిపక్షాలు వీటిలో అక్రమాలను ఎత్తిచూపుతూ, జోరుగా ప్రచారం చేపట్టాయి. మీడియా, కొన్ని సంస్థలు క్షేత్రస్థాయిలో పరిణామాలను వెలుగులోకి తెచ్చాయి. ఈ అప్రమత్తత లేకుంటే, మరికొందరి పేర్లు తొలగిపోయి ఉండేవి, అనర్థం జరిగేది. బీహార్ కేసుతో భారత ఎన్నికల కమిషన్ తీరుతెన్నుల విచికిత్స మొదలైంది. ఒకప్పుడు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే కోటగా పరిగణించిన ఎన్నికల కమిషన్‌ను ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజం అనుమానంతో చూస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఎన్నికల కమిషన్ అధికార పార్టీ ప్రయోజనాలకు కొమ్ముకాస్తోందని విమర్శకులు వాదిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఖరారు, మోడల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యల విషయంలో విముఖత చూపడం, ఓటర్ల జాబితా సవరణ వంటి కసరత్తులో పారదర్శకత లేని విధంగా చర్యలు చేపట్టడంతో అనుమానాలు హెచ్చాయి. బీహార్‌లో ఈ ప్రక్రియను ఇసి అధికారికంగా పర్యవేక్షిస్తున్నా, జవాబుదారీతనాన్ని నిర్ధారించేది కోర్టులు, ప్రతిపక్షమే. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి పలు ప్రశ్నలను లేవనెత్తుతుంది. నిష్పక్షపాతంగా ఉండాల్సిన సంస్థలో ఇతరులు జోక్యం చేసుకుని తటస్థతను ఎందుకు కాపాడాలి. ఓటర్ల హక్కులను కాపాడడంలో చురుగ్గా వ్యవహరించాల్సిన ఇసి ఎందుకు నిష్క్రియాత్మకంగా కన్పిస్తుంది. నమ్మకం, చట్టబద్ధత కలిగిన సంస్థ పక్షపాత ధోరణితో వ్యవహరించడం తీవ్ర హానికరం.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోని పాలక వర్గాలు ఇటువంటి కసరత్తును తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న ఆలోచనే ఎంతో ప్రమాదకరం. మీకు మద్దతు ఇచ్చే అవకాశంలేని ఓటర్లను తొలగించడం లేదా నిరోధించడమే వాటి ఉద్దేశమై ఉంటుంది. బీహార్‌లో పేదవర్గాలు, వలసదారులు, ముస్లింలపై వేటు వేస్తారనే అనుమానాలు తలెత్తాయి. వారు అధికార పార్టీకి ఓటు వేసే అవకాశం తక్కువగా ఉండడమే కారణం. ఇదే నమూనా చాలా చోట్ల కన్పిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని వర్గాల పేర్లు తొలగించారనే ఆరోపణలు అప్పుడప్పుడు తలెత్తుతున్నాయి. ఢిల్లీలో పాలక ప్రభుత్వం మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఓటర్ల




జాబితాలలో మార్పులు చేర్పులు, చేస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి.

అసోంలో ఈ వ్యూహం మరింత ఎక్కువ. జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి) ప్రక్రియ, తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలు కేవలం ఓటర్ల పేర్లను తొలగించే విస్తృత ఎజెండాను ప్రతిబింబించాయి. ముఖ్యంగా ముస్లింలు, అదీ బెంగాలీ మూలాలు కలిగిన ముస్లింలు టార్గెట్ అయ్యారు. దశాబ్దాలుగా నివసిస్తున్న భూముల నుంచి పెద్ద సంఖ్యలో బహిష్కరణకు గురయ్యారు. కీలక డాక్యుమెంట్లు ఉన్నా వారిని తరచు ఆక్రమణదారులుగా ముద్రవేశారు. ఒకసారి భూమిని విడిచి పెడితే వారు తమ శాశ్వత చిరునామా నిరూపించుకునే అవకాశం లేదు. ఓటర్ల జాబితాలో పేర్లు ఉండాలంటే ఇది తప్పనిసరి. ఉద్దేశపూర్వకంగానే తొలగింపు, హక్కుల తొలగింపు సాగుతున్నాయి. మొదట గృహ స్థిరత్వాన్ని తరస్కరించడం, ఆ తర్వాత ఓటింగ్ హక్కులను తిరస్కరించడం. బీహార్‌లో ఓటర్ల జాబితాల సవరణకు చేపట్టిన సర్.. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణకు మోడల్‌గా మారితే ఈ వ్యూహాలే భారీస్థాయిలో సంస్థాగతం అయ్యే ప్రమాదం ఉంది. బీహార్‌లో- సర్- ఓటర్ల జాబితా సవరించే ప్రక్రియగా మొదలై పౌరసత్వ పరీక్షగా ఎలా మారిందో మీడియాలో ఓ వర్గం సరిగ్గానే ఊహించింది. ఇది అసోంలో ఎన్‌ఆర్ సిని ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తదుపరి చర్యలు నిలిపివేయకుంటే, దాదాపు 19 లక్షల మంది గల్లంతు అయిపోయేవారే. రెండు సందర్భాలలోనూ అసలు కీలకం ఒక్క. ఓటరే తాను పౌరుడని రుజువు చేసుకోవాలి. లేని పక్షంలో కమిషన్ డాక్యుమెంటరీ సాక్ష్యాలను కోరుతుంది. పేదలకు అలాంటి ఆధారాలు ఏవీ ఉండవు. బీహార్‌లో ఆమోదయోగ్యమైన డాక్యుమెంట్‌లలో ఆధార్ ను చేర్చడం ఓ ఊరట. అంతమాత్రాన అధికార బహిష్కరణ ప్రమాదం తొలగిపోదు. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం సార్వత్రిక వయోజన ఓటు హక్కు అనే ప్రాథమిక సూత్రాన్ని బలహీనపరుస్తోంది. అది షరతులతో కూడిన ఓటు హక్కుగా మారుస్తోంది. బీహార్ నమూనాను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించడం పెను ప్రమాదం కాగలదు. భారత దేశంలో 97 కోట్ల మంది నమోదు చేసుకున్న ఓటర్లు ఉన్నారు. చిన్న స్థాయిలో 5శాతం మంది పేర్లను తప్పుడు ఓటర్లుగా ముద్ర వేసి తొలగించినా ఐదు కోట్ల మంది పౌరులు ఓటు హక్కు కోల్పోతారు. ఇది అనేక దేశాల్లో ఓటర్ల సంఖ్య కన్నా ఎక్కువ. ఓటర్ల తొలగింపు అన్నది సామాజిక భౌగోళికంగా కూడా ముఖ్యమైంది. వలస కార్మికులు, పట్టణ పేదలు, భూమిలేని రైతులు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారు. ఈ వర్గాలు ఇప్పటికే వ్యవస్థపరంగా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటున్నాయి. పేదరికం, స్థానభ్రంశం, డాక్యుమెంషన్ లేకపోవడంతోపాటు ఎన్నికల హక్కు తొలగిస్తే, వారు రాజకీయంగా కూడా లేకుండాపోతారు. అక్రమ వలసదారుల కథనం అసోం, సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యే అవకాశం లేదు. రాజకీయాలు మరింత ముదిరి పాలక వ్యవస్థలు తమను విమర్శించే వర్గాలపై ఈ గొడ్డలి ఉపయోగించవచ్చు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాలి. ప్రజాస్వామ్యానికి నిష్పాక్షికతతో కూడిన సంరక్షకుడిగా వ్యవహరించాలి. అందుకు అనేక చర్యలు చేపట్టడమే తక్షణ కర్తవ్యం. 1. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపులో పారదర్శకత ప్రదర్శించాలి. ప్రతి తొలగింపుపై బహిరంగంగా వివరణ ఇవ్వాలి. అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలి. 2. స్వతంత్ర పర్యవేక్షణ- ఓటర్ల జాబితా సవరణ పర్యవేక్షణలో పౌరసమాజ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు. స్వతంత్ర పరిశీలకులు అధికారికంగా పాల్గొనే అవకాశం కల్పించాలి. 3. చట్టపరమైన రక్షణలు కల్పించాలి,- ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంటులో స్పష్టమైన పరిమితులను చట్టబద్ధం చేయాలి. ఏకపక్షంగా తొలగింపు ఉండరాదు. 4. డిజిటల్ జవాబుదారీతనం -సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. ఆధార్ ఇతర డేటా బేస్ లు అడ్డంకులు కాకుండా సులభతరం చేయాలి. 5. ప్రజా విశ్వాసం -ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందని కనబడాలి, మోడల్ కోడ్ ఉల్లంఘించిన వారిని శిక్షించడంలో సమానత్వం పాటించడం, అన్ని పార్టీలను సంప్రదించడం, ఓటర్ల చేరికకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి వి పారదర్శకంగా సాగాలి. ఓటర్ల జాబితాపై పోరాటం కేవలం పరిపాలనాపరమైనది కాదు. అస్తిత్వానికి సంబంధించినది. కులం, మతం, వర్గం లింగ భేదం లేకుండా ప్రతి వయోజనుడికి ఓటు హక్కు కల్పించాలన్న సూత్రం భారత ప్రజాస్వామ్యానికి కీలకం, ఏకపక్షంగా ఓటర్ల తొలగింపు ఈ హక్కును నీరుగార్చడం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. బీహార్ అనుభవం రానున్న ముప్పును, అవకాశాలను రెండింటినీ చూపుతోంది. అడ్డుఆపూ లేకుండా సర్ నిర్వహిస్తే లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోతారు. బీహార్ సర్ నిర్వహణ విషయంలో ప్రతిపక్షల అప్రమత్తత, న్యాయవ్యవస్థ జోక్యం, మీడియా పర్యవేక్షణ దిద్దుబాటుకు తోడ్పడ్డాయి. ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తికి ఇవి ప్రత్యామ్నాయం కావు. భారతదేశం అంతటా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లాంటి సవరణలను విస్తరించేందుకు సిద్ధమవుతున్న ఎన్నికల కమిషన్‌కు బీహార్ పాఠాలు హెచ్చరిక కావాలి. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా చర్య తీసుకోవల్సిన సమయం ఆసన్నమైంది. ఇసి తన స్వతంత్ర, న్యాయమైన వారసత్వాన్ని నిపులుకోవాలి. పౌర సమాజం, రాజకీయ ప్రతిపక్షం అప్రమత్తం కావాలి. బ్యాలెట్‌పై నమ్మకం లేకుంటే ప్రజాస్వామ్యానికి మనుగడలేదు.

## చెన్నై సూపర్ కింగ్స్ నాయకుడిగా సంజూ శాంసన్!?

వచ్చే ఐపీఎల్‌లో కొన్ని జట్లకు కొత్త కెప్టెన్లు వచ్చే అవకాశం ఉంది. మినీ వేలం తరువాత టీమ్‌లో ఆటగాళ్లను బట్టి.. కొత్త కెప్టెన్ ఎంపిక చేసే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ వంటి జట్లు కచ్చితంగా కెప్టెన్లను మారుస్తారని ప్రచారం జరుగుతోంది. సంజూ శాంసన్ రాజస్థాన్‌ను వీడడం దాదాపు ఖాయమైంది. వచ్చే సీజన్ ఐపీఎల్‌కు అన్ని టీమ్‌లు రెడీ అవుతున్నాయి. మినీ వేలానికి ముందు ప్లేయర్లపై ఓ అంచనాకు రానున్నాయి. కొన్ని టీమ్‌లు కెప్టెన్లను మార్చే అవకాశం ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌ను మార్చే అవకాశం లేదు. కమ్మిన్స్ నాయకత్వంలోనే సన్‌రైజర్స్ ఓసారి ఫైనల్స్‌కు చేరుకుంది. కమ్మిన్స్‌ను ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్‌కు పూర్తి నమ్మకం ఉంది. ముంబై ఇండియన్స్‌ను హార్దిక్ పాండ్యా నడిపించనున్నాడు. ఈ సీజన్‌లో పాండ్యా నాయకత్వంలో టాప్-4లో నిలిచింది. 2024 సీజన్‌కు ముందు రోహిత్ శర్మను కాదని.. పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కోల్‌కతా నైట్ రైడర్స్ వచ్చే సీజన్‌కు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అజింక్య రహానే స్థానంలో యువ కెప్టెన్‌ను ఎంపిక చేస్తారని అంటున్నారు. మినీ వేలం తరువాత కెప్టెన్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఎలాంటి అంచనాలు లేకుండా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కెప్టెన్‌గా ఎంపికైన రజత్ పాటిదార్.. తొలిసారి ట్రోఫీని అందించాడు. వచ్చే సీజన్‌కు కూడా రజత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా రాకతో పంజాబ్ కింగ్స్ టీమ్ జాతకం మారిపోయింది. అద్భుతమైన బ్యాటింగ్.. స్ఫూర్తిదాయకమైన నాయకత్వంతో పంజాబ్‌ను ఫైనల్ వరకు తీసుకువచ్చాడు. వచ్చే ఏడాది కూడా అయ్యర్ కెప్టెన్‌గా ఉండనున్నాడు.ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్ ఎంపిక చేయాలని ప్లాన్ చేస్తోంది. ఈ సీజన్‌లో అక్షర్ పటేల్ పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. మినీ వేలం తరువాత ఢిల్లీ కూడా కెప్టెన్సీ విషయంలో నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా కొనసాగించాలా.. వద్దా.. అని చెన్నై సూపర్ కింగ్స్ ఆలోచిస్తోంది. ఒకవేళ సంజూ శాంసన్‌ను టీమ్‌లోకి తీసుకుంటే అతడికే కెప్టెన్సీ కూడా అప్పగించే అవకాశం ఉంది. ఇతర స్టార్ ప్లేయర్లు ట్రేడ్ జరగకపోతే.. రుతురాజ్ కెప్టెన్‌గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్‌ను శుభ్‌మాన్ గిల్ మరోసారి నాయకుడిగా నడిపించనున్నాడు. ఇప్పుడు టీమిండియా కెప్టెన్‌గా ప్రమోట్ అయిన గిల్‌కు గుజరాత్‌కు నాయకత్వం వహించడం కలిసి వచ్చింది.



## శ్రేయస్ అయ్యర్ పక్కటెములకు గాయం

సిడ్నీ వేదికగా ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో హర్షిత్ రాణా బౌలింగ్‌లో ఆసీస్ బ్యాటర్ అలెక్స్ కేరీ షాట్ ఆడగా అది మిస్‌టైమింగ్ కావడంతో బంతి గాల్లోకి లేచింది. బ్యాక్‌వర్డ్ పాయింట్ నుంచి బ్యాక్‌కి పరిగెత్తిన శ్రేయాస్ అయ్యర్.. డైవ్ చేస్తూ కళ్లు చెదిరే క్యాచ్ అందు



కున్నాడు. అయితే ఈ క్యాచ్‌ను అందుకునే సమయంలో శ్రేయాస్ బలంగా నేలను గుద్దుకోవడంతో.. అతడి పక్కటెముకలకు గాయమైంది. ఫిజియో వచ్ చూడగా.. శ్రేయాస్ తీవ్రమైన నొప్పితో బాధపడుతుండడంతో గ్రౌండ్ నుండి వెళ్లిపోయాడు. ఇక వెంటనే బీసీసీఐ వైద్య బృందం శ్రేయాస్‌ను సిడ్నీలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో.. శ్రేయాస్‌కి అంతర్గత రక్తస్రావం అవుతున్నట్లు రిపోర్టులో వచ్చింది. దీంతో అతన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు పీటీఐ తెలిపింది. ఓ బీసీసీఐ అధికారి మాట్లాడుతూ.. శ్రేయాస్ అయ్యర్ పక్కటెముకల్లో గాయమైంది. రిపోర్టుల్లో అతడికి రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని ఐసీయూలో చేర్చాం. కనీసం 2 నుంచి 7 రోజుల పాటు అతడు వైద్యుల పర్యవేక్షణలోనే ఉంటాడు. రక్తస్రావం ఆగి, ఇన్ఫెక్షన్ కాకుండా ఉంటే అప్పుడు తదుపరి చర్యలు తీసుకుంటారన్నాడు. మరో బీసీసీఐ అధికారి మాట్లాడుతూ.. శ్రేయస్ అయ్యర్ గాయపడిన వెంటనే టీమ్ డాక్టర్, ఫిజియో ఎలాంటి అవకాశాలను తీసుకోలేదు. వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. లేకపోతే అతడికి ప్రాణాల మీదకు వచ్చి ఉండొచ్చు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. శ్రేయస్ అయ్యర్ ఎంతో ధృఢమైన వ్యక్తి.. అతడు త్వరగా కోలుకుని వస్తాడని చెప్పాడు.

నిజానికి శ్రేయాస్ అయ్యర్ మూడు వారాల్లో కోలుకుంటాడని మొదట వార్తలు వచ్చాయి. ఇప్పుడు అంతర్గత రక్తస్రావం జరుగుతుండడంతో అతడు కోలుకునేందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అతడు చాలా కాలం పాటు ఆటకు దూరం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈ క్రమంలో శ్రేయాస్ అయ్యర్ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు.

## పృథ్వీ షా విధ్వంసకర ద్విశతకం

టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్న వెటరన్ బ్యాటర్ పృథ్వీ షా విధ్వంసకర ద్విశతకంతో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2025లో మహారాష్ట్రకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ మాజీ ముంబై బ్యాటర్.. చండీఘడ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 141 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించాడు.రంజీ ట్రోఫీ చరిత్రలోనే ఇది రెండో వేగవంతమైన ద్విశతకం. ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డ్ రవిశాస్త్రి పేరిట ఉంది. 1984-85 సీజన్‌లో రవి శాస్త్రి 123 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించాడు. తాజాగా పృథ్వీ షా 141 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించి రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో రాహుల్ సింగ్(143 బంతుల్లో) రికార్డ్‌ను పృథ్వీ షా బద్దలు కొట్టాడు. 72 మ్యాచ్‌ల్లో సెంచరీ పూర్తి చేసుకున్న పృథ్వీ షా.. మరో 71 బంతుల్లో డబుల్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. రంజీలో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్ రిషభ్ పంత్(48 బంతుల్లో) పేరిట ఉండగా.. రాజేశ్ బోరా(56), రియాన్ పరాగ్(56), రూబెన్ పాల్(60), రజత్ పటిదార్(68) పృథ్వీ షా కన్నా ముందున్నారు. రంజీల్లో మహారాష్ట్ర తరఫున ఇదే వేగవంతమైన సెంచరీ కావడం గమనార్హం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పృథ్వీ షాకు ఇది 14వ శతకం.ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 8 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపర్చిన పృథ్వీ షా.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం దుమ్మురేపుతున్నాడు. తనదైన బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ దిశగా కొనసాగుతున్నాడు. పృథ్వీ షా విధ్వంసకర బ్యాటింగ్‌తొ మహారాష్ట్ర భారీ స్కోర్ దిశగా సాగుతోంది. రంజీ ట్రోఫీలో మహారాష్ట్ర తరఫున అరంగేట్ర ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన పృథ్వీ షా.. రెండో ఇన్నింగ్స్‌లో 75 పరుగులతో రాణించాడు. ఈ సీజన్ ప్రారంభానికి ముందే ముంబై నుంచి మహారాష్ట్రకు మారిన పృథ్వీ షా.. ముంబైతోనే జరిగిన వామప్ మ్యాచ్‌లో 181 పరుగులు చేశాడు. బుచ్చి బాబు టోర్నీలో తొలి మ్యాచ్‌లోనే 111 పరుగులు చేసాడు. తాజాగా మరో భారీ శతకంతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో అతను ఇదే జోరు కొనసాగిస్తే.. అతి త్వరలోనే టీమిండియా తరఫున టెస్ట్ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చే అవకాశం లభిస్తోంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(116) సెంచరీతో రాణించగా.. సౌరభ్ నవలే(66) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అనంతరం చండీఘడ్ 209 పరుగులకే ఆలౌటైంది. నిషంక్ బిర్లా(56), రమన్ బిష్ణోయ్(54)హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అనంతరం మహారాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లు ముగిసే సరికి 2 వికెట్లకు 285 పరుగులు చేసింది. క్రీజులో పృథ్వీ షా(200 బ్యాటింగ్)తో పాటు రుతురాజ్ గైక్వాడ్(6 బ్యాటింగ్) ఉన్నాడు.



## ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు భారత్ సన్నద్ధం

### సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి..

### సిరీస్‌కు అందుబాటులోకి జస్ప్రీత్ బుమ్రా

భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు విజయం సాధించింది. తొలి 2 వన్డేల్లో కంగారూలు నెగ్గగా, మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య అక్టోబర్ 29 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. టీ20 సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు భారత



కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు ప్రారంభమవుతాయి. అదే సమయంలో మధ్యాహ్నం 1:15 గంటలకు అన్ని మ్యాచ్‌ల టాస్ వేస్తారు. ఇటీవల జరిగిన వన్డే సిరీస్ మ్యాచ్‌లు ఉదయం 9:00 గంటలకు మొదలయ్యేవి. టీ20 సిరీస్‌లో ఇండియా జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో కీలకమైన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబే, సంజు శాంసన్, వరుణ్ చక్రవర్తి వంటి స్టార్ ఆటగాళ్లు టీ20 జట్టులో భాగం కానున్నారు. అయితే, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకోని కారణంగా టీ20 సిరీస్‌కు అందుబాటులో లేదు. వన్డే సిరీస్‌లాగే టీ20 సిరీస్‌లోనూ ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా మిచెల్ మార్ష్ వ్యవహరించనున్నాడు. అయితే తొలి రెండు టీ20 మ్యాచ్‌లకు ఆసీస్ జట్టును ప్రత్యేకంగా ప్రకటించారు. ఆ తర్వాత మూడో టీ20కి వేరే జట్టును, నాల్గవ, ఐదవ టీ20లకు వేరే జట్టును ప్రకటించారు. ఇందులో జోష్ ఇంగ్లిష్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డేవిడ్ అందుబాటులోకి వచ్చారు. అలాగే ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్ కూడా టీ20 జట్టులో ఆడనున్నారు. అక్టోబర్ 29న కాన్‌బెర్రాలో జరగనున్న మ్యాచ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. మొత్తం 5 టీ20 మ్యాచ్‌లు ఆడనుండగా.. గబ్బా వేదికగా చివరి టీ20 షెడ్యూల్ చేశారు. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, టీ20 సిరీస్ లో ఎలాగైనా నెగ్గాలని భావిస్తోంది.

తొలి టీ20 - అక్టోబర్ 29 - కాన్‌బెర్రా - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

రెండవ టీ20 - అక్టోబర్ 31 - మెల్‌బోర్న్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

మూడవ టీ20 - నవంబర్ 2 - హెూబర్ట్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

నాల్గవ టీ20 - నవంబర్ 6 - గోల్డ్ కోస్ట్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

ఐదవ టీ20 - నవంబర్ 8 - గబ్బా - భారత టైం ప్రకారం



# అఖండ 2 తాండవం: బ్లాస్టింగ్ రోర్

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటేనే ఫ్యాన్స్‌కి పూనకాలు రావాల్సిందే. ఈ కాంబోలో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ సినిమాలు బ్లాక్‌బస్టర్ అయ్యారు. ఈ హ్యాట్రిక్ విజయాల తర్వాత ఈ కాంబోలో వస్తున్న నాలుగో చిత్రం 'అఖండ 2 తాండవం'. 2021లో వచ్చిన అఖండ సినిమాకు ఇది సీక్వెల్. ఈ సినిమా నుంచి కొద్ది రోజుల క్రితం వచ్చిన అప్‌డేట్స్ సినిమాపై మరింత హైప్ పెంచేశాయి. తాజాగా బ్లాస్టింగ్ రోర్ అంటూ చిన్న టీజర్‌ని వదిలింది చిత్ర యూనిట్. ఈ వీడియోలో బాలకృష్ణ, బోయపాటి స్టైల్‌లో యాక్షన్ అదరగొట్టారు. "సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో.. ఏ సౌండ్‌కి నవ్వుతానో.. ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు" అంటూ బాలయ్య పవర్‌ఫుల్ డైలాగ్‌తో కేక పెట్టించారు. ఇక ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్‌గా నటిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సంయుక్త ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని నందమూరి సమర్పణలో ఈ సినిమా డిసెంబర్ 5న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది. తమన్ ఈ సినిమాకు సంగీతం అందించారు.

# మరో సీక్వెల్ ప్లాన్ చేస్తున్న సుకుమార్!



టాలీవుడ్ టాప దర్శకుల్లో సుకుమార్ ఒక్కడే రెండు సీక్వెల్స్ తీశాడు. 'ఆర్య' మూవీకి సీక్వెల్‌గా 'ఆర్య 2', 'పుష్ప ది రైజ్' మూవీకి సీక్వెల్‌గా 'పుష్ప 2: ది రూల్' సినిమాలు వచ్చాయి. ఇప్పుడు సుక్కు కాంపౌండ్ నుంచి మరో సీక్వెల్ రానుంది. సుకుమార్ అందించిన కథతో తెరకెక్కిన 'కుమారి 21ఎఫ్' మూవీకి సీక్వెల్ తెరకెక్కించ బోతున్నట్టు ఫిల్మ్ నగర్ సమాచారం. 2015లో సుకుమార్ అందించిన కథతో పల్నాటి సూర్య ప్రతాప్ అనే నవ దర్శకుడు 'కుమార్ 21F' మూవీని తెరకెక్కించాడు. రాజ్ తరుణ్, హెబ్బా పటేల్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ మూవీ.. పదేళ్ల క్రితమే రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది..

ఈ మూవీకి సుకుమార్ సమర్పకుడిగా వ్యవహరించాడు. సుకుమార్ తమ్ముడు బంద్రెడ్డి విజయ్ ప్రసాద్ నిర్మించాడు. ఈ మూవీకి సీక్వెల్‌గా 'కుమార్ 22%ఫీ%' మూవీని ప్లాన్ చేస్తోందట చిత్ర యూనిట్. ఈ మూవీని సుకుమార్ భార్య తబితా సుకుమార్ నిర్మించబోతున్నట్టు సమాచారం. గతంలో 'మారుతినగర్ సుబ్రహ్మణ్యం' సినిమాకి సమర్పకురాలిగా వ్యవహరించింది తబితా సుకుమార్...

'కుమారి 21F' మూవీతో పూర్తి స్థాయిగా సినీ నిర్మాణంలోకి అడుగుపెట్టాలని భావిస్తోందట తబితా సుకుమార్. ఈ చిత్రానికి సుకుమార్ మరోసారి స్వయంగా కథను అందించబోతున్నాడు. 'కుమార్ 21F చిత్ర దర్శకుడు సూర్య ప్రతాప్ దర్శకత్వంలోనే సీక్వెల్ తెరకెక్కుతుందా? లేక కొత్త దర్శకుడికి ఆ బాధ్యతలు ఇస్తారా? మొదటి పార్ట్‌లో నటించిన రాజ్ తరుణ్, హెబ్బా పటేల్ సీక్వెల్‌లో నటించే అవకాశం లేదు. ఎందుకంటే ఈ మూవీ సక్సెస్ తర్వాత వచ్చిన క్రేజ్‌ని రాజ్ తరుణ్ కానీ, హెబ్బా పటేల్ కానీ కాపాడుకోలేకపోయారు. కాబట్టి యూత్‌లో క్రేజ్ ఉన్న కొత్తవాళ్లతో 'కుమార్ 21F' మూవీ తీయాలని అనుకుంటుందోట చిత్ర యూనిట్...

# గుమ్మడి నర్సయ్య బయోపిక్‌లో శివ రాజ్‌కుమార్!



కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, తెలుగులో రామ్ చరణ్‌తో కలిసి 'పెద్ది' మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీతో పాటు మరో తెలుగు సినిమాకి కూడా సైన్ చేశాడు శివ రాజ్‌కుమార్. 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్‌తో తెలుగులోకి హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు శివ రాజ్‌కుమార్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా, కనీసం సొంతంగా ఒక్క స్కూటర్ కూడా కొనుక్కోలేకపోయిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత కథ ఆధారంగా 'గుమ్మడి నర్సయ్య' మూవీ తెరకెక్కుతోంది. పరమేశ్వర్ హిర్వాలే అనే కొత్త దర్శకుడు, 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్‌ని తెరకెక్కిస్తున్నాడు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్‌పై ఎన్ సురేష్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు..

భుజాన ఎర్ర శాలువా వేసుకుని, తెల్లని కుర్తా పైజామాలో ఎర్ర జెండా ఉన్న సైకిల్ పట్టుకుని.. అసెంబ్లీ ముందు ఉన్న ఎమ్మెల్యేగా శివ రాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) పార్టీకి చెందిన గుమ్మడి నర్సయ్య, భద్రాచలంలోని ఎల్లందు ప్రాంతానికి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. 1978లో రైతుల సమస్యలు, గిరిజన తెగలకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి చలించిపోయిన గుమ్మడి నర్సయ్య, రాజకీయాల్లోకి వచ్చారు.

టేకులపల్లి అనే గ్రామానికి సర్పంచిగా గెలిచి, ఆ తర్వాత 1983లో ఎమ్మెల్యేగా మారారు. అయితే ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కనీసం ఖరీదైన చెప్పులు కూడా లేకుండా అత్యంత సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. ఆయన జీవితంతో స్ఫూర్తి పొందిన పరమేశ్వర్ హిర్వాలే, 2022లోనే 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్‌ని అనౌన్స్ చేశాడు. ఆయన జీవితంలో ఎవ్వరికీ తెలియని ఎన్నో విషయాలను సేకరించి, పరిశోధన చేసి... సెట్స్ మీదకి తీసుకెళ్లేందుకు మూడేళ్ల సమయం పట్టినట్టు సమాచారం..



# బాలీవుడ్‌ను రూల్ చేస్తున్న రష్మిక...

రష్మిక మందన్న ఇప్పుడు బాలీవుడ్ బాక్స్ ఆఫీస్ ను రూల్ చేస్తుంది. మొన్నా మధ్య నాగార్జున చెప్పినట్టు 2000 కోట్ల హీరోయిన్ ఆమె. పుష్ప, చావా, యానిమల్ సినిమాల సూపర్ హిట్లతో ఆమె ఎవ్వరికీ సాధ్యం కానీ రికార్డు క్రియేట్ చేసింది. ఇక ఇప్పుడు వరసపెట్టి తెలుగు, హిందీలలో సినిమాలు చేస్తున్న రష్మిక రీసెంట్ మూవీ 'థామా' కూడా హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సినిమాకు ఆయుష్మాన్ ఖురానా సినిమాగా కంటే రష్మిక సినిమాగానే ఎక్కువ క్రేజ్ వచ్చింది అని చెప్పాలి. అది ఇప్పుడు మన నేషనల్ క్రష్ రేంజ్. రష్మిక దెబ్బకు 'థామా' మూవీ అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. దాంతో ఇప్పుడు రష్మిక బాలీవుడ్ తన పేరు మీద ఒక అరుదైన రికార్డు నెలకొల్పింది....

హిట్టు మాత్రమే మాట్లాడే ఇండస్ట్రీ ఇది. ఏ సినిమా హిట్టవుద్దో ఏది ఫట్టవుతుందో ఎవ్వరూ జడ్జ్ కూడా చెయ్య లేరు. అటువంటి పరిశ్రమలో ఇప్పుడు రష్మిక నెలకొల్పిన ఆ అరుదైన రికార్డు ఏంటంటే 2025 లో ఆమె 3 హిందీ సినిమాల్లో నటిస్తే ఆ మూడు సినిమాలు ఘన విజయాలు సాధించాయి. అంతే కాదు 2025 టాప్ 5 బాలీవుడ్ ఓపెనింగ్స్ లో ఆమె సినిమాలే మూడు ఉన్నాయి. ఇది ఒక అరుదైన రికార్డు. పోనీ ఆమె నటించిన సినిమాలు కూడా ఏమీ నాలుగు డైలాగులు, మూడు పాటల్లో డాన్సులు ఉండే గ్లామర్ డాల్ హీరోయిన్ పాత్రలు కాదు. హిస్టారికల్ డ్రామా, యాక్షన్ థ్రిల్లర్, హారర్-కామెడీ ఇలా వేటికవే విభిన్నమైన చిత్రాలు. ఒకసారి ఆమె వసూళ్ళలో క్రియేట్ చేసిన రికార్డ్ ను చూద్దాం...

### థామా:

మొన్న దీపావళి కానుకగా అక్టోబర్ 21 రిలీజయిన 'థామా' సినిమా అదిరిపోయే ఓపెనింగ్స్ వసూలు చేసింది. మ్యాడాక్ ఫిలిమ్స్ హారర్ కామెడీ యూనివర్స్ లో 5 వ భాగంగా తెరకెక్కిన ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగల్ రిలీజయినప్పటి నుండి ఈ మూవీకు విపరీతమైన హైప్ వచ్చింది. కారణం ఒక్కటే రష్మిక మందన్న. ఈ పాటలో గతంలో ఎన్నడూ లేనట్టు అదిరిపోయే బోల్డ్‌లుక్‌లో కనిపిం చిన రష్మిక కుర్రకారు గుండెల్లో గుచ్చింది. ఈ సినిమా కోసం వెయిట్ చేసేలా చేసింది. దానికితో మలైకాతో చేసిన రెండో సాంగ్ రిలీజవ్వటంతో హైప్ ఇంకా పెరిగింది. ఆల్రెడీ వరసపెట్టి హిట్లతో జోరు మీద ఉన్న రష్మిక క్రేజ్ తోడయ్యి ఈ సినిమాకు అదిరిపోయే ఓపెనింగ్స్ సాధించి పెట్టింది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా 31.92 కోట్లు వసూలు చేసింది. భారతీయ బాక్సాఫీస్‌లో మాత్రం 25.11 కోట్లు వసూలు చేసి టాప్ 5లో ఉన్న సయ్యారాను వెనక్కి నెట్టి 4వ స్థానంలో నిలబడింది.



### ఛావా:

రష్మిక, విక్కీ కౌశల్ జంటగా నటించిన ఈ సినిమా ఎంత పెద్ద హిట్టో చెప్పనవసరం లేదు. ఈ మూవీ వరల్డ్ వైడ్ ఏకంగా 807.91 కోట్లు వసూలు చేసింది రికార్డులు క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 14 న విడుదలైన ఈ సినిమా మొదటి రోజు ఇండియా నెట్ 31 కోట్లు వసూలు చేసి 2025 టాప్ 5 ఓపెనింగ్స్ సినిమాల్లో 2 వ స్థానం లో నిలిచింది. ఇక వరల్డ్ వైడ్ వసూళ్లు చూసినట్లయితే 50.05 కోట్లు కొల్లగొట్టింది. ఇది రష్మిక చేసిన ఫస్ట్ పీరియాడిక్ డ్రామా. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు మరాఠా వీరుడు శివాజీ కొడుకు శంభాజీ మొఘలులపై చేసిన పోరాటం ఆధారం. ఈ సినిమా లో రష్మిక చేసిన పాత్ర ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

### సికందర్:

సల్మాన్ జతగా రష్మిక చేసిన ఈ సినిమాకు AR మురుగదాస్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలయ్యాక ఫ్లాప్ గా నిలిచినా ఓపెనింగ్స్ వసూళ్లు అదరగొట్టింది. ఈ మూవీ తొలిరోజు వరల్డ్ వైడ్ 54.29 కోట్లు వసూలు చేసింది. దేశీయంగా నెట్ 26 కోట్లు నెట్ వసూలు చేసి టాప్ 5 లిస్టులో మూడో స్థానం లో నిలబడింది.



### 2025 టాప్ 5 హిందీ ఫస్ట్ డే ఓపెనింగ్స్

వార్ 2 – రూ. 52 కోట్లు
ఛావా – రూ. 31 కోట్లు
సికందర్ – రూ. 26 కోట్లు
థామా – రూ. 25.11 కోట్లు
హౌస్ ఫుల్ 5 – రూ. 24 కోట్లు

ఇక 2025 ఫస్ట్ డే ఓపెనింగ్స్ లో తొలిస్థానంలో నిలబడ్డ చిత్రం కూడా మన టాలీవుడ్ హీరో దే కావడం విశేషం. ఎవరో తెలుసా? మన యంగ్ టైగర్ ఎన్టీఆర్. అతను చేసిన తొలి హిందీ చిత్రం 52 కోట్ల నెట్ వసూళ్లతో టాప్ 1 ప్లేస్ లో నిలబడింది. ఈ విధంగా చూస్తే 2025 లో టాప్ 5 లో 4 సినిమాలు మన టాలీవుడ్ స్టార్స్ పేరు మీద ఉన్నాయని చెప్పొచ్చు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154